TGTEL/26/A0320

# భారతీయ వెలుగు

జాతీయ తెలుగు దిన పత్రిక




శుక్రవారం ఫిబ్రవరి 13, 2026 | సంపుటి :01 | సంచిక :28 | రంగారెడ్డి | గున్నాల లావణ్య | పేజీలు -12 | వెల-5

Hyderabad,KarimNagar, Warangal, Khammam, Nalgonda, Mahabub Nagar, Nizamabad, Gadwal, Medak, Vikarabad, Wanaparthy, Siddipet,

# హిందువుల మనోభావాలు దెబ్బతింటాయి

దేశ రాజధాని న్యూఢిల్లీలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పర్యటన బిజీ బిజీగా సాగుతోంది. ఇప్పటికే పలువురు కేంద్ర మంత్రులను సీఎం రేవంత్ రెడ్డి కలిశారు. కేంద్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలను కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి దృష్టికి వారు తీసుకెళ్లారు. వానాకాలం పంటకు (2025 – 26 సీజన్) సంబంధించి తెలంగాణ రాష్ట్రం అదనంగా సేకరించిన 18 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఎఫ్‌సీఐ తీసుకోవాలని కేంద్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో కలిసి సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు. అలాగే యాసంగి ధాన్యం సేకరణ గడువు రెండు నెలలు పొడిగించాలని ఆయన్ని వారు కోరారు. ఇక బాయిల్డ్ రైస్‌లో అయిదు శాతం నూకకు అనుమతించండాలని విజ్ఞప్తి చేశారు. 2లో



- అదనంగా 18 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనండి
- బకాయి పెట్టిన రూ.1,468.94 కోట్లను వెంటనే విడుదల చేయండి
- కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి సిఎం రేవంత్ వినతి

# 114 రఫేల్ జెట్ల కొనుగోలుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్..!



త్రివిధ దళాల పోరాట సామర్థ్యాన్ని పెంచే దిశగా కేంద్ర రక్షణశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు వణుకు పుట్టించిన రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు ప్రతిపాదనకు కేంద్రం ఓకే చెప్పింది. రూ.3.60 లక్షల కోట్ల వ్యయంతో ఫ్రాన్స్‌తో అతిపెద్ద రక్షణ ఒప్పందానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 114 రఫేల్ యుద్ధవిమానాలను కొనుగోలు చేసేందుకు రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని డిఫెన్స్ కౌన్సిల్ ఆమోదించిందని రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ఈ నెల 18న భారత పర్యటనకు రానున్నారు. ఈ నేపథ్యంలోనే ఈ కొనుగోలుకు రక్షణశాఖ నుంచి ఆమోదం లభించించడం గమనార్హం.

2లో..

# ముఖ్యమంత్రిని కలిసిన సినీ నిర్మాత బండ్ల గణేష్

- చంద్రబాబు సీఎం కావాలని తిరుమలకు పాదయాత్ర
- సంకల్ప యాత్ర పేరుతో 535 కిలోమీటర్ల నడక
- మొక్కు చెల్లించుకుని శ్రీవారి ప్రసాదం అందజేత
- పాదయాత్ర సాగిన తీరు అడిగి తెలుసుకున్న సీఎం
- బండ్ల గణేష్‌ను ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్న చంద్రబాబు




**అమరావతి, ఫిబ్రవరి 12**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును అసెంబ్లీలోని ఆయన ఛాంబర్‌లో సినీ నిర్మాత బండ్ల గణేష్ గురువారం కలిశారు. గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపిన తరుణంలో, ఆయన విడుదలయ్యి మళ్ళీ ముఖ్యమంత్రి అయితే తిరుమలకు పాదయాత్రగా వస్తానని బండ్ల గణేష్ మొక్కుకున్నారు. 2024 ఎన్నికల్లో కూటమి విజయం సాధించి చంద్రబాబు నాలుగోసారి ముఖ్యమంత్రి కావడంతో బండ్ల గణేష్ తన మొక్కును తీర్చుకున్నారు.

సంకల్ప యాత్ర పేరుతో షాద్‌నగర్‌లోని తన నివాసం నుంచి జనవరి 19న పాదయాత్ర ప్రారంభించి, ఈ నెల 10వ తేదీన తిరుమలకు చేరుకున్నారు. 23 రోజుల పాటు సుమారు 535 కిలోమీటర్ల మేర ఈ యాత్ర సాగింది. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్న అనంతరం అమరావతికి వచ్చిన బండ్ల గణేష్, స్వామివారి ప్రసాదాన్ని ముఖ్యమంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు బండ్ల గణేష్‌ను ఆత్మీయంగా పలకరించి ఆలింగనం చేసుకున్నారు. దారి పొడవునా పార్టీ కార్యకర్తలు తనకు అండగా నిలిచారని, వారి ప్రోత్సాహంతోనే ఉత్సాహంగా పాదయాత్ర పూర్తి చేశానని బండ్ల గణేష్ ముఖ్యమంత్రికి తెలిపారు.

2లో..

# మనుబోలులో వైఎస్ షర్మిలా రెడ్డి మన్రేగా పరిరక్షణ యాత్ర

- వైఎస్సార్ పథకాలు అద్భుతం
- బిజెపి కుట్రతో ఉపాధి హామీ నిర్వీర్యం
- కొత్త చట్టం రాష్ట్రానికి భారం
- టీడీపీ, వైసీపీ పార్టీలు మోదీకి బానిసలు
- కాంగ్రెస్ పాలనతోనే సువర్ణ అధ్యాయం



2లో..

# ఏపీ బ్రాండ్‌ను నిలబెడుతున్న కూటమి ప్రభుత్వం



- సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పాలన
- సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు మేలు
- మహిళా సాధికారతకు పెద్దపీట
- మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగాల భర్తీ
- పల్లె పండుగతో గ్రామాల్లో అభివృద్ధి

**అమరావతి, ఫిబ్రవరి 12**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తోందని కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి తెలిపారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై ఆమె మాట్లాడుతూ, గత పాలనలో దెబ్బతిన్న రాష్ట్ర బ్రాండ్‌ను మళ్లీ నిలబెట్టేందుకు సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అనే మూడు ఆయుధాలతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 ద్వారా తలసరి ఆదాయం పెంచడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం 20 నెలల కాలంలోనే సూపర్ సిక్స్ హామీలను 90 శాతం అమలు చేసిందని వివరించారు. తల్లికి వందనం ద్వారా 67 లక్షల మంది తల్లుల ఖాతాల్లో రూ.10,090 కోట్లు జమ చేశామన్నారు.

2లో..

# డిప్యూటీ సీఎం పవన్‌తో ఎమ్మెల్యే బాలకృష్ణ భేటీ



అమరావతి: ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తో హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు బాలకృష్ణ భేటీ అయ్యారు. అసెంబ్లీలోని పవన్ ఛాంబర్‌లో ఆయన్ను కలిశారు. హిందూపురం నియోజకవర్గ సమస్యలపై ఆయనతో చర్చించారు. పవన్ కల్యాణ్‌ను ఆయన సోదరుడు, ఎమ్మెల్సీ నాగబాబు కూడా కలిశారు. గిద్దలూరు నియోజకవర్గ సమస్యలపై పవన్‌కు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు.




# ఎన్ని కార్పోరేషన్‌లు అయినా ఎగిరేది గులాబీ జెండాయే

**శేరిలింగంపల్లి నేతలతో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్**

హైదరాబాద్ కార్పొరేషన్‌ను ఎన్ని కార్పొరేషన్లు చేసినా ఎగిరేది మాత్రం ఖచ్చితంగా గులాబీ జెండానేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన యువ నాయకుడు విజయ్ కుమార్ రెడ్డి తన అనుచరులతో కలిసి గురువారం బీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలోకేటీఆర్ వారికి గులాబీ కండువా కప్పి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు. ఎమ్మెల్యేలు పోయినా.. పార్టీ వెన్నెముక కార్యకర్తలేనన్నారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే పార్టీని వీడినా,

2లో..



# లిక్కర్ స్కామ్ క్షమించరాని నేరం

- రూ.3500 కోట్ల భారీ కుంభకోణం
- సుప్రీంకోర్టు వ్యాఖ్యలతో వెల్లడైన నిజాలు
- నిందితులకు బెయిల్ ఇచ్చే ప్రసక్తే లేదు
- అధికారుల అండతోనే అక్రమాలు
- జగన్ మోహన్ రెడ్డి రాజకీయాల నుండి తప్పుకోవాలి

2లో..

# బొత్స సవాళ్లకు మేం సిద్ధం: మండలిలో మంత్రి పార్థసారథి



అమరావతి: శాసన మండలిలో గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మంత్రి పార్థసారథి – వైకాపా నేత బొత్స సత్యనారాయణ మధ్య వాడీవేడి చర్చ జరిగింది. పరస్పరం సవాళ్లు, ప్రతిసవాళ్లు విసురుకున్నారు. తల్లికి వందనం కింద ప్రభుత్వం ఎవరికీ పూర్తిగా రూ. 15 వేలు ఇవ్వలేదని బొత్స అన్నారు. 15 శాతం మందికి తల్లికివందనం కింద కేవలం రూ. 7-8 వేలే చెల్లించారని చెప్పారు. ఏ నియోజకవర్గంలోనూ తల్లికి వందనం కింద పూర్తి డబ్బు చెల్లించలేదని బొత్స పేర్కొన్నారు. సభను తాను తప్పుదోవ పట్టించినట్లు రుజువు చేస్తే క్షమాపణ చెబుతానని చెప్పారు. విపక్ష నేత బొత్స చేసిన ఛాలెంజ్‌ను స్వీకరించేందుకు తాము సిద్ధమని మంత్రి పార్థసారథి వెల్లడించారు. 48 లక్షల మందికి 'అన్నదాత సుఖీభవ' ఇవ్వలేదని అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. ఒక్క రైతుకు కూడా రూ. 20 వేలు ఇవ్వలేదని వైకాపా సభ్యులు చెప్పడం సరికాదన్నారు. మైక్ ఉంది కదా అని ప్రభుత్వంపై బురదజల్లి.. ప్రజలను తప్పుదోవ పట్టించవద్దని మంత్రి సూచించారు. చర్చ అనంతరం శాసనమండలి శుక్రవారానికి వాయిదా పడింది.

2లో..

# సంపాదకీయం

## చినజీయర్ వ్యాఖ్యలపై ఓ వైష్ణవుడి ధర్మాగ్రహం

నా వయస్సు 78 సంవత్సరాలు. ఈ వయోభారం నా మీద ఉన్న ప్రత్యేక బాధ్యతలను గుర్తుచేస్తూంటుంది. జాగ్రత్తగా ఆలోచించి మరీ మాట్లాడాల్సిన అవసరం ఉన్నదన్న సూచన చేస్తుంది. చిన్ననాటి నుంచే వైష్ణవ సంప్రదాయానికి అంకితభావంతో ఉన్న సామాన్యుడిని. త్రిదండి పెద శ్రీమన్నారాయణ జీయర్ స్వామి ఆశీస్సుల కింద 'సమాశ్రయణం' (పంచ సంస్కారం) పొందే సదవకాశం కలిగినవాడిని. ఆ అనుభవమే, నా ఆధ్యాత్మిక వ్యక్తిత్వాన్ని, నియమశీలతను జీవితాంతం నిలిచేలా మలిచింది.శైవ, వైష్ణవ, శాక్త, స్మార్త తదితర అనేక ధారలు కలిసి ప్రవహించే ఒక విశాలమైన నాగరిక, ఆధ్యాత్మిక పరంపరగా, సజీవ వాహినైన 'సనాతన ధర్మం'గా వైదిక తత్వాన్ని భావించాను. వైష్ణవ సంప్రదాయానికి కట్టుబడి ఉన్నప్పటికీ, హిందూ సంప్రదాయాలన్నిటినీ సమాన గౌరవంతో భావిస్తూ వచ్చాను. అందుకే, ఇటీవలి పరిణామాలు ఒక మౌనమైన విరక్తికి దారితీశాయి. ఇది కోపం కాదు, లోతైన ఒక విషాదం. దీనికి తక్షణ కారణం, త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామీజీ అలవోకగా, జగద్గురు ఆదిశంకరాచార్యుల గురించి చేసిన వ్యాఖ్యలు. ఇవి పలువురు చరిత్రకారులను, పండితులను, వివిధ సంప్రదాయాలకు చెందిన నిష్ఠాగరిష్ఠ భక్తులను కలవరపరిచాయి. ఆదిశంకరాచార్యులు ఘనమైన వైష్ణవ భక్తుడని, ఆయన నాలుగు శంకర పీఠాలను స్థాపించనేలేదని, శతాబ్దాల తరువాత విద్యారణ్యులు స్థాపించారని, చినజీయర్ స్వామి వ్యాఖ్యలుగా సామాజిక మాధ్యమాలలో విమర్శలతో సహా చక్కర్లు కొడుతున్నాయి. అద్వైత వేదాంతాన్ని ప్రచారం చేసిన తరువాత ఆదిశంకరులు చిన్న వయస్సులోనే హిమాలయాలకు పోయి సమాధి పొందారని ప్రతీతి. ఆ ఆచార్యోత్తముడితో అనుసంధానించబడే శంకర పీఠాల వ్యవస్థకు ఆయనకు సంబంధంలేదనేది జీయర్ స్వామి వ్యాఖ్యల సారాంశం. ఈ వ్యాఖ్యలు సత్యమా, అసత్యమా అన్నది పక్కనపెడితే, ఆదిశంకరాచార్యుల పట్ల అపార భక్తి కలిగిన అనేకమంది మనోభావాలను అవి గాయపరిచాయన్నది మాత్రం వాస్తవం.ఆదిశంకరాచార్యులు దక్షిణంలో శృంగేరి, పశ్చిమంలో ద్వారక, తూర్పున పూరీ, ఉత్తరంలో జ్యోతిర్మఠం అనే నాలుగు పీఠాలను స్థాపించిన జగద్గురువుగా గుర్తింపు పొందిన మహనీయుడు. ఇవి భారత ఉపఖండమంతటా వేదాధ్యయనాన్ని, ఆధ్యాత్మిక క్రమశిక్షణను, ఐక్యతను కాపాడే ఆధ్యాత్మిక మౌలిక స్తంభాలుగా భావితమయ్యాయి. ఆదిశంకరుల జీవన కాలానికి సంబంధించిన వివరాలలో చరిత్రకారుల అభిప్రాయాలు ఒకింత భిన్నంగా ఉన్నాయి. అయితే అద్వైత చింతనాభివృద్ధిలో ఆదిశంకరుల ప్రాథమిక కీలక పాత్రను గానీ, శంకర పీఠాల వ్యవస్థతో ఆయన అనుసంధానాన్ని గానీ చరిత్రాధ్యయనం ఎప్పుడూ గంభీరంగా ప్రశ్నించలేదు. ఉపనిషత్తులు, భగవద్గీత, బ్రహ్మసూత్రాలపై ఆయన వ్యాఖ్యానాలు ఇప్పటికీ హిందూ ధర్మానికి కేంద్ర స్తంభాలు. మధ్య యుగాలలో హిందూ ధార్మిక సంస్థలను పునరుజ్జీవింపజేసిన మహనీయుడిగా విద్యారణ్యులను గౌరవిస్తారు. కానీ శంకర పీఠాలను ఆదిశంకరాచార్యులు కాదు, విద్యారణ్యులే స్థాపించారన్న వాదన సాధారణంగా అంగీకృతమైన చారిత్రక లేదా సంప్రదాయ కథనంలో భాగంగా కనిపించదు. అయితే, ఆ వాదన కంటే ఎక్కువగా కలవరపెట్టే అంశం: అలాంటి వ్యాఖ్యల ధోరణి, దిశ. సంప్రదాయ భేదాల ముసుగులో ఒక మహత్తర సామూహిక ఆధ్యాత్మిక వారసత్వాన్ని, వర్గీయ వ్యాఖ్యానాల ద్వారా తగ్గించినట్టు అనిపించినప్పుడు, సనాతన ధర్మంలో అనవసర విభేదాలు పుట్టే ప్రమాదం ఉంటుంది. అవసరమా? జగద్గురువుగా ప్రసిద్ధికెక్కిన ఆదిశంకరాచార్యులు వైష్ణవులు, శైవులు, స్మార్తులు తదితర అన్ని సంప్రదాయాల వారిచే సమరీతిలో గౌరవింపబడుతూ వచ్చిన ఐక్యతా ప్రతీక. వైష్ణవ క్రమశిక్షణలో పెరిగినవాడినైనా, విశాలమైన హిందూ నాగరిక దృష్టికోణానికి కట్టుబడి ఉన్నవాడిగా, ఈ పరిణామం ఒక అసహజమైన అశాంతిగా భావన కలుగుతున్నది. అభిప్రాయభేదాలకు ఆస్కారం ఇస్తూనే, సాధారణ తత్త్వజ్ఞానాన్ని చెరిపేయని పరంపర కారణానే సనాతన ధర్మం సజీవ వాహినిగా నిలిచింది. ఆ సున్నితమైన సమతౌల్యాన్ని మనం కోల్పోకూడదు.

అద్వైత, విశిష్టాద్వైత, ద్వైత... ఈ మూడు ప్రధాన వేదాంత సంప్రదాయాల వర్తమాన ప్రతినిధులను, ఆచార్యులను సందర్శించే, ఆశీస్సులు పొందే భాగ్యం నాకు పలుమార్లు లభించింది. ఆ అనుభవాల ద్వారా స్పష్టంగా అర్థమైంది ఏమిటంటే, భారత తత్వశాస్త్రం గతానికి చెందిన ఒక అవశేషం కాదు, అనాది నుంచి నేటిదాకా ప్రవహిస్తున్న సజీవధార. ఆ ధారను ముందుకు తీసుకువెళ్తున్న మహనీయులు తమ విజ్ఞానాన్ని గంభీరతతోనే కాకుండా, కృపతో, సంయమంతో జీవింపజేస్తున్న ప్రతినిధులు. వారితో మాట్లాడుతుంటే, సజీవమైన ఆధ్యాత్మిక సంప్రదాయాన్ని ప్రత్యక్షంగా అనుభవించినట్లుగా భావన కలగడం సహజం. ఆదిశంకరాచార్యులు, రామానుజాచార్యులు, మధ్వాచార్యులు ఆదిలో కానీ, కాలగమనంలో కానీ, వారివారి తత్త్వ జ్ఞానాన్ని నలుదిక్కులా ప్రసరింపజేశారే కానీ, పరస్పర ప్రత్యర్థులుగా వ్యవహరించలేదు.

ఈ ముగ్గురు మహా ఆచార్యులు తమ తమ కాలాల ఆధ్యాత్మిక అవసరాలకు స్పందనగా అవతరించారు. విభజన, అయోమయం వ్యాప్తిలో ఉన్న కాలంలో శంకరాచార్యులు అద్వైత వేదాంతాన్ని ప్రతిపాదించి ఆత్మజ్ఞానాన్ని వెలిగించారు. అదే ఏకత్వ దర్శనం. ఉపనిషత్తుల ఆత్మజ్ఞానంపై, అంతర్గత మేల్కొలుపుపై ఆయన పునఃప్రాధాన్యాన్ని నెలకొల్పారు. వివిధ దేవతారూపాలను, క్రమబద్ధమైన తర్కాన్ని, ఆధ్యాత్మిక సాధనను సమన్వయపరిచే ఒక విశాల సమ్మేళనాన్ని ఆయన తత్వం అందించింది. వేదజ్ఞానాన్ని సంరక్షించి, తరతరాలకు అందించే స్థిరమైన పీఠాల ఆవిర్భావానికి అది దారితీసింది. అద్వైత తత్వహృదయంలో, సర్వసత్త్వంలో నిగూఢంగా ఉన్న ఏకత్వ ప్రకటన ఉంది.రామానుజాచార్యులు విశిష్టాద్వైతం ద్వారా భక్తి, ప్రపత్తి మార్గాలను ప్రజలందరికీ అందించారు. భక్తి భూమికను పూర్తిగా పునర్నిర్మించారు. బ్రహ్మన్ ఏకత్వాన్ని అంగీకరిస్తూనే, జగత్తు యథార్థతను, జీవాత్మ వ్యక్తిత్వాన్ని ఆయన సమర్థించారు. ఈ రెండింటినీ శ్రీమన్నారాయణుడితో గాఢమైన సంబంధంలో బంధించారు. ఫలితంగా భక్తి, ప్రపత్తి మార్గాలు సామాన్యులకూ అందుబాటులోకి వచ్చాయి. సామాజిక అడ్డంకులను దాటుతూ, భక్తిని జీవనంలో ఆచరించే కరుణగా మారుస్తూ,

## ఎన్ని కార్పోరేషన్‌లు అయినా ఎగిరేది గులాబీ జెండాయే

మొదటి పేజీ తరువాయి

కార్యకర్తలు మాత్రం చెక్కుచెదరకుండా కేసీఆర్ నాయకత్వంలోనే ఉన్నారని ప్రశంసించారు. మొత్తం హైదరాబాద్‌లోనే శేరిలింగంపల్లి నియోజకవర్గం పార్టీకి నంబర్ వన్ కోటగా నిలిచింది. స్వార్థ ప్రయోజనాల కోసం కొందరు వెళ్లినా, బంగారం వంటి కొత్త నాయకులు వందల సంఖ్యలో పార్టీలో చేరుతున్నారు.

శేరిలింగంపల్లిలోని 24 డివిజన్లలో క్లీన్ స్వీప్ చేసే సత్తా మనకుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలతో అరిచేతుల వైకుంఠం చూపి అధికారం దక్కించుకుందని కేటీఆర్ విమర్శించారు. మరోవైపు బీజేపీ 12 ఏళ్లుగా తెలంగాణకు 12 పైసల పని కూడా చేయలేదని, అది 'పూజకు పనికిరాని పువ్వు' అని ఎద్దేవా చేశారు. 'వెట్టి పనికైనా, మట్టి పనికైనా మనోడే ఉండాలి' అన్న నానుడిని గుర్తు చేస్తూ, తెలంగాణకు కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని కేటీఆర్ పేర్కొన్నారు.

నగరంలో శాంతిభద్రతలు అదుపు తప్పాయని కాంగ్రెస్ పాలనలో హైదరాబాద్ ప్రతిష్ట దెబ్బతింటోందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పట్టపగలే సుల్తాన్ బజార్ ఎస్‌బీఐ బ్రాంచ్‌లో దోపిడీలు, చందానగర్‌లో జ్యువెలరీ షాపులపై దాడులు, హత్యలు జరుగుతున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో వ్యాపారాలు, వాణిజ్య సంస్థలు కుదేలయ్యాయని, కొత్త కొలువులు రాకపోగా ఉన్నవి పోయే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. త్వరలో రాబోయే కార్పొరేషన్ ఎన్నికల కోసం డివిజన్ల వారీగా సమావేశాలు నిర్వహించి పార్టీని మరింత పటిష్టం చేస్తామన్నారు కేటీఆర్. ఎమ్మెల్యే లేదని భయపడకండి, మీకు అండగా నేను, తలసాని శ్రీనివాస్ యాదవ్, అరికెపూడి, కృష్ణారావు ఉంటాం. ఏ అవసరమొచ్చినా మేము అందుబాటులో ఉంటామని కేటీఆర్ హామీ ఇచ్చారు. తప్పుడు ఓటు వేస్తే ఐదేళ్ల పాటు శిక్ష అనుభవించాల్సి వస్తుందని, ఓటు వేసే ముందు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని.. ముఖ్యంగా మహిళా లోకానికి కేటీఆర్ విన్నవించారు. చదువుకున్న యువత రాజకీయాల్లోకి రావడం శుభపరిణామమని, విజయ్ కుమార్ రెడ్డి వంటి యువకులు పార్టీకి ఆస్తి అని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, జగదీష్ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు , నేతలు పాల్గొన్నారు.

## లిక్కర్ స్కామ్ క్షమించరాని నేరం

మొదటి పేజీ తరువాయి

ఏపీ లిక్కర్ స్కామ్ విషయంలో సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పునిచ్చిందని సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తెలిపారు. ఇది రూ.3500 కోట్ల భారీ కుంభకోణమని, నిందితుడు రాజ్ కసిరెడ్డికి బెయిల్ ఇచ్చే ప్రసక్తే లేదని న్యాయస్థానం స్పష్టం చేసిందన్నారు. రాజకీయ నాయకులు, అధికారుల అండతోనే ఈ స్కామ్ జరిగిందని సాక్షాత్తు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు వ్యాఖ్యానించారని పేర్కొన్నారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ లో ప్రముఖ నాయకులు జైలుకు వెళ్లారని, అప్పటి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి ప్రత్యేక చట్టాలు ఏమీ లేవని విమర్శించారు. సిట్ విచారణలో పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ధనుంజయరెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తదితరుల పాత్ర వెలుగులోకి వచ్చిందని తెలిపారు. ఈ స్కామ్ కేవలం ధనానికి సంబంధించింది మాత్రమే కాదని, వేలాది మంది ప్రాణాలు, లక్షలాది మంది ఆరోగ్యంతో ముడిపడి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కల్తీ మద్యంతో నిరుపేద కుటుంబాలను ఆర్థికంగా దెబ్బతీశారని ధ్వజమెత్తారు. ఇంత భారీ పాపానికి ఒడిగట్టిన జగన్ మోహన్ రెడ్డి ప్రజలకు క్షమాపణ చెప్పి, ఎమ్మెల్యే పదవితో పాటు రాజకీయాల నుండి వైదొలగాలని డిమాండ్ చేశారు.

## చుంచులూరు లో ఉన్నత పాఠశాలలో శుభ దిన్ భోజన్ కార్యక్రమం.

మర్రిపాడు మండల పరిధిలోని చుంచులూరు గ్రామంలోనీ ఉన్నత పాఠశాలలో శుభ దిన్ భోజన్



కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామానికి చెందిన తిరుపతి లోని బాలాజీ టింబర్స్ అధినేత కంచి రాము పుట్టినరోజు సందర్భంగా వారి కుమార్తె మన్విత,అల్లుడు రాగదీప్ లు విద్యార్థులకు రుచికరమైన విందు భోజనాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్ మాట్లాడుతూ కొన్ని ప్రత్యేకమైన సందర్భాలలో దాతలు ముందుకు వచ్చి విద్యార్థులకు విందు భోజనాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో విశ్రాంత మండల విద్యాశాఖ అధికారి జొన్నా.సత్యనారాయణ,పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్వీ గోసంరక్షణ ట్రస్ట్ కు రూ. 10,00,116 విరాళం

టిటిడి ఆధ్వర్యంలోని ఎస్వీ గోసంరక్షణ ట్రస్ట్ కు రూ. 10,00,116 విరాళాన్ని తిరుపతికి చెందిన బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్ కుమార్ తనయుడు కుప్పాల నీలేష్ కుమార్ గురువారం అందించారు. ఈ మేరకు విరాళం డిడిని టిటిడి అడిషనల్ ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి కి తిరుపతిలోని అడిషనల్ ఈవో నివాస గృహంలో దాత అందజేశారు. ఈ సందర్భంగా దాత కుప్పాల నీలేష్ కుమార్ ను అడిషనల్ ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి అభినందించారు.

## హిందువుల మనోభావాలు దెబ్బతింటాయి

మొదటి పేజీ తరువాయి



అదే విధంగా భారత ఆహార సంస్థకు (ఎఫ్‌సీఐ) 2014 -15 వానా కాలంలో సరఫరా చేసిన బియ్యానికి సంబంధించి తెలంగాణకు బకాయి పెట్టిన రూ.1,468.94 కోట్లను వెంటనే విడుదల చేయాలని కేంద్ర మంత్రి జోషిని సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ విజ్ఞప్తి చేశారు. వానా కాలం పంటకు సంబంధించి 53.73 లక్షల మెట్రిక్ టన్నులకు (ఎల్‌ఎంటీ) అనుమతించారని.. కానీ భారీగా పంట ఉత్పత్తి కావడంతో.. అదనంగా 18 ఎల్‌ఎంటీలు తాము సేకరించినందున ఆ మొత్తాన్ని 10 శాతం నూకతో ఎఫ్‌సీఐ సేకరించాలని కేంద్ర మంత్రికి వారు విజ్ఞప్తి చేశారు.

## నాలుగేళ్ల మోడీ విదేశీ ఖర్చు రూ. 462.58కోట్లు

మొదటి పేజీ తరువాయి

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యాక్షన్ సమ్మిట్‌లో పాల్గనడంతో పాటు మార్సెయిల్‌లో భారత రాయబార కార్యాలయాన్ని ప్రారంభించారు. 2023 జూన్‌లో అమెరికా పర్యటనకు రూ.22.8కోట్లు వ్యయం కాగా, 2021 సెప్టెంబర్‌లో అమెరికా సందర్శనకు రూ.19.6 కోట్లు ఖర్చు చేశారు. ఈసందర్శనల ఉద్దేశ్యం క్వాడ్ సదస్సు, ఐక్యరాజ్యసమితిలో ప్రసంగించడం. అమెరికా, యుఎఇ, జపాన్‌లలో ఒక్కో దేశాన్ని నాలుగు సార్లు సందర్శించారు. ఫ్రాన్స్‌ను మూడు సార్లు, బ్రిటన్, రష్యా, బ్రెజిల్, దక్షిణాఫ్రికాల్లో ఒక్కోదేశాన్ని రెండు సార్లు సందర్శించారు. దౌత్య సంబంధాల బలోపేతం కోసం ఈ పర్యటనలు చేసినట్లు ప్రధాని మోడీ పేర్కొన్నప్పటికీ.. దేశంలో ఓ వైపు ఇప్పటికీ ఆహారం, వసతి కోసం ఇబ్బందిపడుతుండటం గమనార్హం. ఈ సందర్శనల కోసం వినియోగించే ప్రభుత్వ వ్యయాన్ని ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికోసం ఖర్చు చేయాలని పలువురు మేధావులు, నిపుణులు పేర్కొంటున్నారు.విదేశీ ప్రయాణాల కోసం అత్యధదిక వ్యయంపై ప్రతిపక్షాలు గతంలో ప్రశ్నలు లేవనెత్తిన సంగతి తెలిసిందే.

## మనుబోలులో వైఎస్ షర్మిలా రెడ్డి మన్రేగా పరిరక్షణ యాత్ర

మొదటి పేజీ తరువాయి

నెల్లూరు జిల్లాకు చేరుకున్న ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి మనుబోలు మండలం అక్కంపేట గ్రామం వద్ద మన్రేగా పరిరక్షణ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో రాష్ట్రం సస్యశామలంగా ఉండేదని, ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయంబర్స్ మెంట్ వంటి అనేక పథకాలు పేదలకు ఎంతో మేలు చేశాయని తెలిపారు. వైఎస్సార్ ఆశయాల నుంచే ఉపాధి హామీ పథకం పుట్టిందని, 2006లో బండ్లపల్లిలో మన్మోహన్ సింగ్, సోనియా గాంధీ దీనిని ప్రారంభించారని గుర్తు చేశారు. వైఎస్సార్ హయాంలో 1.10 కోట్ల జాబ్ కార్డులు ఉండేవని, వలసలు తగ్గాయని, కూలీలకు అనేక సౌకర్యాలు ఉండేవని వివరించారు.

ప్రస్తుతం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ఖూనీ చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ తెచ్చిన పథకం అన్న కక్షతో మోదీ దీనిని నీరుగారుస్తున్నారని మండిపడ్డారు. కొత్తగా తెచ్చిన విబి గ్రామ్ జి చట్టం వల్ల గ్రామసభల హక్కులు పోయి, నిర్ణయాధికారం కేంద్రం చేతికి వెళ్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి కూలీలను కాంట్రాక్టర్ల వద్ద లేబర్ సప్లై కింద మార్చే కుట్ర జరుగుతోందని, ఈ చట్టం వల్ల రాష్ట్రంపై ఏడాదికి 5 వేల కోట్ల అదనపు భారం పడుతుందని తెలిపారు. అప్పుల్లో ఉన్న రాష్ట్రం ఇంత భారం మోయలేదని పేర్కొన్నారు.

ఈ అక్రమ చట్టానికి చంద్రబాబు మద్దతు ఇవ్వడం ద్రోహమని, జగన్ సైతం మోదీకి బానిసలా వ్యవహరిస్తూ వ్యతిరేకించడం లేదని దుయ్యబట్టారు. రాష్ట్రంలోని టీడీపీ, జనసేన, వైసీపీ పార్టీలు మోదీకి గులాంగిరీ చేస్తున్నాయని, ఎవరికీ రాష్ట్ర అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. మన్రేగా చట్టం కోసం పోరాటం ఉధృతం చేయాలని, రాష్ట్రంలో మార్పు రావాలంటే ప్రజలు కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే మళ్ళీ సువర్ణ అధ్యాయం మొదలవుతుందని షర్మిలా రెడ్డి తెలిపారు.

చట్టం పునరుద్ధరణ జరిగే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏపీ బ్రాండ్‌ను నిలబెడుతున్న కూటమి ప్రభుత్వం

మొదటి పేజీ తరువాయి

ఉచిత బస్సు ప్రయాణం, దీపం పథకం ద్వారా ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీతో మహిళల ఆత్మగౌరవాన్ని పెంచామని పేర్కొన్నారు. 46 లక్షల మంది రైతులకు రూ.6,310 కోట్లు అందజేసి వ్యవసాయానికి అండగా నిలిచామన్నారు.

ఎన్టీఆర్ భరోసా కింద 63 లక్షల మందికి ఇంటి వద్దే పింఛన్లు పంపిణీ చేస్తున్నామని, యువత కోసం మెగా డీఎస్సీ ద్వారా 15,941 టీచర్ పోస్టులు, 5,757 కానిస్టేబుల్ పోస్టుల భర్తీ చేపట్టినట్లు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవతో గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పల్లె పండుగ ద్వారా వేలాది అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని ఆమె కొనియాడారు.

## 114 రఫేల్ జెట్ల కొనుగోలుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్..!

మొదటి పేజీ తరువాయి

అయితే, ఏడాది చివరి నాటికి ఈ కొనుగోళ్ల కోసం ఇరు దేశాల మధ్య అధికారిక ఒప్పందం జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.


ఈ 114లో 88 సింగిల్ సీట్, 26 ట్విన్ సీట్ వేరియంట్లు భారత వాయుసేన (ఐఏఎఫ్)లో విధులు నిర్వర్తించనున్నాయి. అలాగే మేక్ ఇన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా స్థానికంగా తయారీ, అసెంబ్లీ వంటి వాటి కోసం ఫ్రాన్స్‌కు చెందిన రఫేల్ మాతృ సంస్థ డసో ఏవియేషన్.. భారత్‌లోని ప్రయివేటు రంగ సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకోనుంది. భారత వాయుసేన వద్ద ఇప్పటికే 36 రఫేల్ యుద్ధవిమానాలు ఉన్నాయి.

## బొత్స సవాళ్లకు మేం సిద్ధం: మండలిలో మంత్రి పార్థసారథి

మొదటి పేజీ తరువాయి

గంటన్నరపాటు నడపాలని నిర్ణయం

శాసనమండలి బీఏసీ సమావేశం జరిగింది. అన్ని పార్టీల సభ్యులతో చర్చించి పలు నిర్ణయాలను మండలి బీఏసీ తీసుకుంది. మండలిని ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నడపాలని నిర్ణయించినట్లు మండలి ఛైర్మన్ మోషేన్ రాజు తెలిపారు.



"ప్రశ్నోత్తరాలు రోజూ గరిష్ఠంగా గంటన్నరపాటు నడపాలని నిర్ణయించాం. సభ్యుల ప్రశ్నలు, మంత్రుల సమాధానాలు క్లుప్తంగా ఇవ్వాలి" అని మోషేన్ రాజు తెలిపారు.

# కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ



**భారతీయ వెలుగు శేరిలింగంపల్లి ప్రతినిధి**
సీఎం రేవంత్ రెడ్డి రెండో రోజు ఢిల్లీలో పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా దేశ రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో ఆయన భేటీ అయ్యారు. ఫిబ్రవరి చివరి వారంలో జరిగే గాంధీ సరోవర్ ప్రాజెక్టు శంకుస్థాపనకు రావాలని ఆహ్వానించారు. ఈసా-మూసీ నదుల సంగమ స్థలంలో ఈ ప్రాజెక్టు చేపడుతున్నట్లు, 1948లో మహాత్ముని చితాభస్మాన్ని ఇక్కడే నిమజ్జనం చేశారని వివరించారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులో భాగంగా బాపూఘాట్‌ను ప్రపంచ స్థాయి చిహ్నంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.


# అంత్యక్రియలకు “చందూ” ఆర్థిక సహాయం

**భారతీయ వెలుగు,తూ..గో.జిల్లా ప్రతినిధి(అనపర్తి):**



ఇప్పటికే ఎంతో మందికి ఎన్నో విధాలుగా సహాయం అందించి తన దాతృత్వం చాటుకున్న కోస్తాంధ్ర రెడ్డి యువజన సంక్షేమ సంఘం అధ్యక్షులు తాడి చంద్రశేఖర్ రెడ్డి(చందూ) మరోసారి తన సహకార గుణం చాటుకున్నారు.ఒక పేద వ్యక్తి అంత్యక్రియలకు మానవత్వ దృక్పథంతో ముందుకు వచ్చి ఆర్థిక సహాయం చేయడం పట్ల చంద్రశేఖర్ రెడ్డి సేవలను పలువురు కొనియాడుతున్నారు.వయస్సుతో సంబంధం లేకుండా,విశాలమైన మనస్సుతో నిస్వార్థంగా దానం చేస్తూ ఎందరికో “చందూ” ఆదర్శంగా నిలుస్తున్నారు.కాగా చిన్న వయస్సులో ఇటువంటి దాతృత్వం చూపుతూ సమాజానికి చంద్రశేఖర్ రెడ్డి స్ఫూర్తిగా నిలిచారనడంలో సందేహం లేదు.

# వైఎస్ జగన్ ను కలిసిన సుబ్బిరెడ్డి దంపతులు



**భారతీయ వెలుగు,తూ.గో.జిల్లా ప్రతినిధి(సత్తి వెంకటరెడ్డి,అనపర్తి):**
వైఎస్సార్ సీపీ అధ్యక్షులు,మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ని పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్తి సుబ్బిరెడ్డి అచ్చియ్యమ్మ దంపతులు తాడేపల్లి లో కలిశారు.గురువారం వైఎస్ జగన్మోహనరెడ్డి కలవగా పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని సూచించినట్టు సుబ్బిరెడ్డి తెలిపారు.ప్రజా సంక్షేమమే ధ్యేయంగా మన ప్రభుత్వం పనిచేసిందని మళ్ళీ వచ్చే ఎన్నికల్లో వైసీపీ గెలవడం కోసం పాటు పడాలని జగన్ చెప్పారని ఆయన అన్నారు.ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పార్టీ కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని మాజీ సీఎం జగన్ తెలిపారని సుబ్బిరెడ్డి వివరించారు.

# మున్సిపల్ ఎన్నికల్లో బీసీ అభ్యర్థుల దూకుడు



– జాతీయ బిసి మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్

**భారతీయ వెలుగు, హైదరాబాద్, ఫిబ్రవరి 12:**
తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో బీసీ అభ్యర్థులు చూపిన ప్రదర్శన రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. రిజర్వేషన్ అమలులో రాజకీయ పార్టీల వైఖరిపై బీసీ సమాజం ఈ ఎన్నికల ద్వారా స్పష్టమైన సందేశం ఇచ్చిందని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ అన్నారు.గురువారం కాచిగూడ లో ఆయన మాట్లాడుతూ.. రిజర్వేషన్ వ్యవస్థలో బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించడంలో పార్టీలు విఫలమయ్యాయని విమర్శించారు. ఆ అసంతృప్తి ఈ ఎన్నికల్లో ఓట్ల రూపంలో వ్యక్తమైందని తెలిపారు.ఈ ఎన్నికల్లో మొత్తం 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లు కలిపి 123 నగరపాలక సంస్థలలో 2,996 వార్డులకు పోలింగ్ జరిగింది. పార్టీలకు అతీతంగా అనేక మున్సిపాలిటీల్లో జనరల్ స్థానాల్లో పోటీ చేసిన బీసీలకు ప్రజలు విశేష మద్దతు తెలిపారని రాజేందర్ పటేల్ వెల్లడించారు. ‘బీసీ ఓటు బీసీలకే’ అనే భావజాలం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో బలంగా ప్రతిఫలించిందని చెప్పారు. ఇది కేవలం ఎన్నికల ఫలితం మాత్రమే కాదు, బీసీల సామాజిక ఆత్మగౌరవానికి సంకేతమని వ్యాఖ్యానించారు. బీసీల జనాభా ప్రాతిపదికన అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో కనీసం 50 శాతం ప్రాతినిధ్యం కల్పించేలా ప్రభుత్వం, రాజకీయ పార్టీలు స్పష్టమైన విధానం ప్రకటించాలని రాజేందర్ పటేల్ డిమాండ్ చేశారు.

# కోనసీమ జిల్లాలో అగ్నిప్రమాదం 11 తాటాకు పూరిళ్లు దగ్ధం

మామిడికుదురు మండలంలోని ఆల్ క్యాస్ట్ కాలనీలో గురువారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో 11 తాటాకు ఇళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ప్రమాదం వల్ల 13 కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. మరికొన్ని ఇళ్లకు మంటలు వ్యాపించకుండా త్వరితగతినే మంటలను అదుపుచేశారు. ప్రమాదంలో 13 కుటుంబాలకు చెందిన విలువైన గృహోప కరణాలు, వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. ఓ వ్యక్తి గ్యాస్ సిలిండర్ వెలిగించే సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. అగ్నిమాపక శాఖ అధికారులు ప్రస్తుతం ఆస్తి నష్టాన్ని అంచనా వేస్తున్నారు. పరిహారం, పునరావాసం కోసం సంబంధిత అధికారులు చర్యలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. అగ్నిప్రమాద ఘటనతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది.

# ఎస్సీ-ఎస్టీ రిజర్వేషన్లలో క్రీమీ లేయర్ విధానం

**» ఆర్థికంగా స్థిరపడిన వారిని రిజర్వేషన్ వర్తించకుండా (క్రీమీ లేయర్)**
**» కేంద్రానికి సుప్రీంకోర్టు ‘డెడ్ లైన్’!**
**» రిజర్వేషన్ల నుంచి మినహాయించడంపై**
**» సుప్రీంకోర్టు మరోసారి క్రియాశీలక పాత్ర పోషిస్తోంది...**
**» రిజర్వేషన్ల ప్రయోజనాలు నిజమైన లబ్ధిదారులకు అందేలా చూడాలని.. సుప్రీంకోర్టు ఆదేశం**
**» వర్గీకరణపై తీసుకున్న చర్యలు ఏమిటని సుప్రీంకోర్టు ప్రశ్నించింది.**



**భారతీయ వెలుగు న్యూఢిల్లీ ప్రతినిధి**
దేశంలో ఎస్సీ-ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణ, ఆ వర్గాల్లోని ఆర్థికంగా స్థిరపడిన వారిని(క్రీమీ లేయర్) రిజర్వేషన్ల నుంచి మినహాయించడంపై సుప్రీంకోర్టు మరోసారి క్రియాశీలక పాత్ర పోషిస్తోంది. ఎస్సీ-ఎస్టీ రిజర్వేషన్ల ప్రయోజనాలు నిజమైన లబ్ధిదారులకు అందేలా చూడాలని.. క్రీమీ లేయర్‌ను మినహాయించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై స్పందించిన ధర్మాసనం.. దీనిపై తమ నివేదిక సమర్పించాలని కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

**రాజ్యాంగ ధర్మాసన తీర్పుపై ఆరా**
జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చీ, జస్టిస్ ఎన్వీ అంజారియాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ కేసును విచారించింది. 2024లో ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఎస్సీ-ఎస్టీ రిజర్వేషన్లను ఉప-వర్గాలుగా విభజించేందుకు (కోటాలో కోటా) అనుమతినిస్తూ చారిత్రాత్మక తీర్పునిచ్చింది. ఆ తీర్పు వెలువడిన తర్వాత కేంద్ర సర్కారు క్రీమీ లేయర్ అమలుపై లేదా వర్గీకరణపై తీసుకున్న చర్యలు ఏమిటని సుప్రీంకోర్టు ప్రశ్నించింది.

**పిటిషనర్ల వాదనలు.. డిమాండ్లు**
ఓపీ శుక్లా, ‘సమతా ఆందోళన్ సమితి’ ఈ పిటిషన్లను దాఖలు చేశాయి. రిజర్వేషన్ల ఫలాలు కేవలం ఒకే వర్గానికి లేదా ఆ వర్గాల్లోని సంపన్నులకే పరిమితం కాకుండా.. అత్యంత వెనుకబడిన ఉప-కులాలకు చేరాలని వారు వాదించారు. ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సర్వీసుల్లో వివిధ ఉప-కులాల ప్రాతినిధ్యంపై స్పష్టమైన డేటాను సేకరించాలని.. అలాగే క్రీమీ లేయర్‌ను గుర్తించేందుకు అవసరమైన ప్రమాణాలను నిర్ణయించాలని పిటిషనర్లు కోర్టును కోరారు.

వర్గీకరణపై స్పష్టమైన నిబంధనలు
ఆగస్టు 2024 నాటి తీర్పులో సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వాలకు ఎస్సీ-ఎస్టీలను వర్గీకరించే అధికారం ఇచ్చింది. అయితే ఈ ప్రక్రియ ఏకపక్షంగా ఉండకూడదని, రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా శాస్త్రీయ ఆధారం, తగిన డేటా ఆధారంగానే వర్గీకరణ జరగాలని స్పష్టం చేసింది. అంతేకాకుండా ఓబీసీ తరహాలోనే ఎస్సీ-ఎస్టీ రిజర్వేషన్లలో కూడా క్రీమీ లేయర్ అమలును పరిశీలించాల్సిన అవసరం ఉందని అప్పట్లోనే అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది.

**కేంద్రం ఇచ్చే వివరణపై ఉత్కంఠ**
ప్రస్తుతానికి కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై తన వివరణ ఇవ్వాలని ఆదేశించిన సుప్రీంకోర్టు.. తదుపరి విచారణను కొద్ది రోజులు వాయిదా వేసింది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సమాధానం, గణాంకాల ఆధారంగానే ఎస్సీ-ఎస్టీ రిజర్వేషన్లలో క్రీమీ లేయర్ అమలుపై ఒక తుది నిర్ణయం వచ్చే అవకాశం ఉంది. ఇది దేశవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున సర్వత్రా ఉత్కంఠ నెలకొంది

# 15న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి 32వ అఖండ జ్యోతి రథయాత్ర

**– యాత్ర కమిటీ చైర్మన్ సద్ది వెంకట్ రెడ్డి**






భారతీయ వెలుగు,హైదరాబాద్, ఫిబ్రవరి 12: శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి 32వ అఖండ జ్యోతి రథయాత్ర ఈ నెల 15వ తేదీన బర్కత్ పుర లోని యాదాద్రి భవన్ నుంచి ప్రారంభమవుతుందని యాత్ర కమిటి చైర్మన్ సద్ది వెంకట్ రెడ్డి, గౌరవ సలహదారులు పడాల శ్రీకాంత్, అధ్యక్షుడు యం.చంద్రశేఖర్, సహాయ కార్యదర్శి బొమ్మల సుదీష్ కుమార్ తెలిపారు. గురువారం బర్కత్ పుర యాదాద్రి భవన్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో అఖండ జ్యోతి రథయాత్ర ప్రచార పోస్టర్ ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15వ తేదీన ఆదివారం బర్కత్ పుర లో రథయాత్ర ప్రారంభమై 18వ తేదీన యాదగిరి గుట్టకు చేరుకుని అఖండ జ్యోతిని ఆలయంలో అందించడం జరుగుతుందని తెలిపారు. 15న రథయాత్ర ప్రారంభమై బర్కత్ పుర, చిక్కడపల్లి, విద్యానగర్, అడిక్మెట్, తార్నాక, హబ్సిగూడ, ఉప్పల్, 16న ఉప్పల్, ఫిర్జాదిగూడ, మేడిపల్లి, నారపల్లి, అన్నోజిగూడ, శివారెడ్డిగూడెం, ఘట్కేసర్, 17న ఘట్కేసర్, కొండమడుగు, బీబీనగర్, గూడూరు, పగిడిపల్లి, భువనగిరి, 18న భువనగిరి, రాయగిరి, వడాయిగూడెం మీదుగా యాదగిరి గుట్టకు రథయాత్ర చేరుకుంటుందన్నారు. రథయాత్ర ప్రారంభోత్సవ కార్యక్రమానికి కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు కొమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ, ప్రభుత్వ విఫ్, ఎమ్మెల్యే చామల కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కంభం అనిల్ కుమార్ రెడ్డి, అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఆలయ అనువంశిక ధర్మకర్త నర్సింహ్మా మూర్తి, ఆలయ ఈవో జె.భవాని శంకర్, నగరిగారి ప్రీతమ్ కుమార్ తదితర ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో యాదాద్రి భవన్ మేనేజర్ రామ కోటేష్, రథసారధి ఎ.గణపతి, ఎ. అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ఓట్ల లెక్కింపు ప్రక్రియ పారదర్శకంగా జరగాలి

**– అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన: కలెక్టర్ ప్రతీక్ జైన్**




**భారతీయ వెలుగు: చీఫ్ బ్యూరో, వికారాబాద్, ఫిబ్రవరి:12,**
శుక్రవారం 13వ తేదీన నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా,ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. గురువారం సమీకృత కలెక్టర్ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఓట్ల లెక్కింపు ప్రక్రియపై మాట్లాతూ. ఈ సందర్భంగా ఓట్లు లెక్కింపు కేంద్రంలో అనుసరించాల్సిన నియమావళి, ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, టేబుల్‌వైజ్ కౌంటింగ్ విధానం, బ్యాలెట్ పేపర్లు వేరు చేయుట, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు విధానం తదితర అంశాలపై సమగ్రంగా సూచనలు చేశారు. ప్రతి రౌండ్ లెక్కింపు పూర్తయ్యే సరికి ఫలితాలను సమగ్రంగా నమోదు చేసి, సంబంధిత అభ్యర్థుల ఏజెంట్ల సంతకాలు తీసుకోవాలని, తదుపరి పరిశీలకుల అనుమతితో విజేతలను ప్రకటించాలని సూచించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, ఎన్నికల సంఘం నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. లెక్కింపు కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టినట్లు తెలిపారు. గుర్తింపు కార్డు కలిగిన వ్యక్తులకు మాత్రమే అనుమతి ఉంటుందని, మొబైల్ ఫోన్ లకు అనుమతి లేదని తెలిపారు. కౌంటింగ్ సిబ్బంది ఉదయం 7 గంటల వరకు లెక్కింపు కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో కౌంటింగ్ ప్రక్రియ కొనసాగుతుందని, అనుమతి పొందిన వ్యక్తులకే ప్రవేశం కల్పించబడుతుందని స్పష్టం చేశారు. లెక్కింపు సిబ్బంది సమయానికి కేంద్రాలకు హాజరై తమ విధులను బాధ్యతా యుతంగా నిర్వర్తించాలని ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు.
ఈ సందర్భంగా నాలుగు మున్సిపల్ కమిషనర్లతో కౌంటింగ్ ఏర్పాట్లపై వివరాలు అడిగి తెలుసు కున్నారు. జిల్లా ఎస్పి స్నేహ మెహర మాట్లాడుతూ స్పెషల్ ఫోర్స్ ను ఏర్పాటు చేశామని, డిఎస్పిలను నియమించామని, పూర్తి బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ సుధీర్,వికారాబాద్, తాండూర్, పరిగి, కొడంగల్, మున్సిపల్ కమిషనర్లు,తహసీల్దార్ లు స్పెషల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లు పక్కడ్బందిగా ఉండాలి

**» జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**





**భారతీయ వెలుగు: చీఫ్ బ్యూరో, వికారాబాద్, ఫిబ్రవరి:12**
మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను పారదర్శకంగా, శాంతియుతంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు.
గురువారం వికారాబాద్ పట్టణం లోని ఎస్ఎపి కళాశాల నందు, కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించి, అధికారులతో మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రంలో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండాలని, కౌంటింగ్ కేంద్ర పరిసరాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, అనుమతి ఉన్న సిబ్బంది, అభ్యర్థుల, ఏజెంట్లకే ప్రవేశం ఉంటుందని, 34 వార్డ్స్,12 టేబుల్స్, ఒక సూపరింటెండెట్, ఇద్దరు అసిస్టెంట్లు ఒక టేబుల్ కు ముగ్గురు చొప్పున ఏర్పాటు చేస్తున్నట్లు, కౌంటింగ్ హాలు లోపల, ఎంట్రెన్స్ బయట సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చెయాలనీ , ఎట్టి పరిస్థితుల్లో మొబైల్ ఫోన్ అనుమతి లేదని అధికారులకు ఆదేశించారు.కౌంటింగ్ ప్రక్రియ ఉదయం 8.00 గంటలకు ప్రారంభమై, నిర్ణీత సమయాల్లో దశలవారీగా కొనసాగుతుందని తెలిపారు. తాగునీరు, వైద్య సదుపాయాలు, విద్యుత్ నిరంతరాయంగా ఉండేలా, ప్రత్యన్మయంగా ఎనరేటర్, బ్యాటరీ బ్యాకప్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని, అభ్యర్థులు, వారు నియమించు కున్న ప్రతినిధులు ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, పోలీస్ బలగాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. కౌంటింగ్ ఫలితాలను అధికారిక వెబ్ సైట్ నందు ఉంచుతా మని మీడియా ద్వారా తెలియజేయ నున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విక్రం సింహరెడ్డి, తహసిల్దార్ లక్ష్మీనారాయణ, ఎస్ఐ,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ని మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ కార్పొరేటర్ రోజా దేవి రంగారావు..



**భారతీయ వెలుగు ప్రతినిధి కూకట్పల్లి**
శేర్లింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని వివేకానంద నగర్ డివిజన్ నుంచి బిఆర్ఎస్ పార్టీ టికెట్ ఇచ్చి కార్పొరేటర్ గా గెలిపించి ప్రజలకు సేవ చేసుకునే అవకాశం ఇచ్చినందుకు కూకట్పల్లి శాసనసభ్యులు, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇన్చార్జ్ మాధవరం కృష్ణారావు తో కలిసి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావుని గురువారం మాధవరం రోజా దేవి రంగారావు కలిసి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.
ఈ సందర్భంగా రోజా దేవి మాట్లాడుతూ వివేకానంద నగర్ డివిజన్ నుండి కార్పొరేటర్ గా గెలిపించి ఐదు సంవత్సరాల కాలంలో డివిజన్ అభివృద్ధిలో సహకరించిన నాయకులకి, కార్యకర్తలకి, ప్రజలకు, అధికారులకి ప్రింట్,ఎలక్ట్రానిక్ మీడియా సోదరులందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో ప్రజా సేవలో ముందుంటానని అన్నారు.

# ఈ లోకాన్ని చల్లగా చూడు శివయ్య..

» షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకరయ్య
» రామలింగేశ్వరున్ని దర్శించుకున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దంపతులు
» శ్రీ పార్వతి రామలింగేశ్వర స్వామి కళ్యాణోత్సవం
» శివయ్యకు అభిషేకం చేసిన ఎమ్మెల్యే శంకర్, అనురాధ దంపతులు

తెలంగాణ రాష్ట్రంలోనే అత్యంత మహిమానిత్వమైన, స్వయంభూ లింగం శ్రీ ఉత్తర రామలింగేశ్వర స్వామి దేవాలయాన్ని స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్, ఆయన సతీమణి అనురాధ దంపతులు స్వామి వారిని దర్శించుకున్నారు. బుధవారం రామేశ్వరంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం అయ్యాయి. ఆలయ నిర్వహణ అధికారి శివ కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శంకర్ దంపతులతో స్వామి వారికి అభిషేకం చేయించారు. అదేవిధంగా బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీ పార్వతి రామలింగేశ్వర స్వామి కళ్యాణోత్సవంలో ఎమ్మెల్యే దంపతులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెంట లింగారెడ్డిగూడెం ఉపసర్పంచ్ ఎర్రోళ్ల అశోక్ దంపతులు, కృష్ణ దంపతులు, నవీన్ దంపతులు, బుడ్డ నరసింహ దంపతులు, మంకాళి శ్రీశైలం దంపతులు, అలాగే కాంగ్రెస్ నేతలు అగ్గనూరు బస్వం, చల్లా శ్రీకాంత్ రెడ్డి, బాలరాజ్ గౌడ్, తుపాకుల శేఖర్, రాయికల్ శ్రీనివాస్, భార్గవ కుమార్ రెడ్డి, సంపత్ కుమార్, పినమోని శ్రీనివాస్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



**ఈ లోకాన్ని చల్లగా చూడు శివయ్య**

ఈ లోకాన్ని చల్లగా చూసే స్వామి ముక్కంటి శివయ్య అని ఆయన ఆశీసులు భక్తులపై ఎల్లవేళలా ప్రసరిస్తాయని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. ఆయన కరుణా కటాక్షాలతో ప్రభుత్వం ప్రజలను చల్లగా పాలిస్తుందని అన్నారు. శివరాత్రి మహాదిన పర్వాన బ్రహ్మోత్సవాలు ప్రభుత్వ అత్యంత వైభవంగా నిర్వహిస్తుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీళ్ళపల్లి శంకర్ అనురాధ దంపతులకు ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికి ఆయనను సన్మానించారు.

**ఉత్సవాలు ఇలా..**



ఫరూక్ నగర్ మండలం రామేశ్వరంలో ఈనెల 11వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం అయ్యాయనీ ఆలయ కార్య నిర్వహణ అధికారి శివకుమార్ తెలిపారు. ఈ నెల 18వ తేదీ వరకు కొనసాగే ఈ బ్రహ్మోత్సవాలకు సంబంధించి మొదటి రోజు గణపతి పూజ, రుద్ర హోమం, ధ్వజారోహణం ప్రతిష్ట తదితర కార్యక్రమాలు ఉంటాయి. 12వ తేదీన శ్రీ పార్వతి రామలింగేశ్వర స్వామి కళ్యాణోత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. 13న నంది సేవ, అగ్ని గుండాలు తదితర కార్యక్రమాలు ఉంటాయి. 14న రుద్రాభిషేకం, విశేష అలంకరణ నిర్వహిస్తారు. 15వ తేదీన మహాశివరాత్రి ని పురస్కరించుకొని పెద్ద ఎత్తున కార్యక్రమాలు ఉంటాయి. 16న రుద్రహోమం పూర్ణాహుతి కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు. 17వ తేదీన ఉదయం 9 గంటలకు శ్రీ రామలింగేశ్వర స్వామి కళ్యాణోత్సవం జరుగుతుంది. 18న శివతీర్థంతో కార్యక్రమాలు ముగుస్తాయని నిర్వాహకులు వెల్లడించారు . భక్తులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు..

# రైల్వే ఓవర్ - అండర్ బ్రిడ్జిల పెండింగ్ పనులు పూర్తి చేయండి



» పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి

**భారతీయ వెలుగు: చీఫ్ బ్యూరో/వికారాబాద్, ఫిబ్రవరి:12,**
చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో పెండింగ్ లో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జిలు/రైల్వే అండర్ బ్రిడ్జిల పనులు సత్వరమే చేపట్టాలని కోరుతూ పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి న్యూఢిల్లీలోని రైలు భవన్ లో రైల్వే మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి వి.సోమన్న తో సమావేశమయ్యారు. గత సంవత్సరం శంకరపల్లి ప్రాంతానికి విచ్చేసిన కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కూడా ఈ మేరకు వినతిపత్రం అందజేసినట్టు ఆయన వివరించారు. అదేవిధంగా నావంద్గి రైల్వేస్టేషన్ లో హుబ్లీ ఎక్స్‌ప్రెస్ రైలు నిలపడానికి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సానుకూల ప్రతిపాదన పంపడం జరిగిందని, దానికి అనుగుణంగా రైల్వే బోర్డు ద్వారా తక్షణం హుబ్లీ ఎక్స్‌ప్రేస్ రైలును ఆపడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఈ మేరకు కొండా విశ్వేశ్వర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. వికారాబాద్ పట్టణంలోని జిల్లా కోర్టు వద్ద, రామయ్య గూడ ప్రాంతాలలో ఉన్నటువంటి రైల్వే లెవెల్ క్రాసింగ్ ల వద్ద డిపిఆర్ లు పూర్తయిన దృష్ట్యా ఆర్ఓబి, ఆర్ యుబిల నిర్మాణానికి వెంటనే పనులు ప్రారంభించడానికి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా కొండకల్, ముబారక్ పూర్, మర్పల్లి, పాత శంకర్పల్లి, మొరంగుపల్లి, గేట్ వనంపల్లి, గొల్లగూడ, నావంద్గి, సిద్ధాంతి, శాతంరాయి, ఫతేపూర్ (ఎల్.హెచ్.ఎస్) ల నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరగా రైల్వే మంత్రి సానుకూలంగా స్పందించారు.

# పటిష్టమైన భద్రత మధ్య ఓట్ల లెక్కింపు

**– వికారాబాద్ ఎస్పీ స్నేహా మెహ్రా**

**భారతీయ వెలుగు:చీఫ్ బ్యూరో, వికారాబాద్, ఫిబ్రవరి:12,**
వికారాబాద్ జిల్లా కేంద్రంలో మునిసిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని భద్రతా చర్యలు తీసుకొని పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా తెలిపినారు. ఓట్ల లెక్కింపు దృష్ట్యా, జిల్లాలోని నాలుగు మునిసిపల్ పట్టణాల్లో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్న నేపథ్యంలో, కౌంటింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో, విజయోత్సవ ర్యాలీలు, బైక్ ర్యాలీలు, ఊరేగింపులు, బాణాసంచా కాల్చడం, డీజే సౌండ్ సిస్టమ్‌ల వినియోగం, నిషేధించబడినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.ఫలితాలు వెలువడిన అనంతరం కూడా ప్రజలు సంయమనం పాటించాలని, ఉత్సాహంలో ఎలాంటి చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడవద్దని ఎస్పీ తెలిపినారు.
కౌంటింగ్ కేంద్రాల పరిసరాల్లో నిర్దిష్ట పరిధిలో 144 సెక్షన్



అమలులో ఉంటుందని తెలిపారు. ఈ సెక్షన్ అమలులో ఉన్న సమయంలో ఐదుగురికి మించి గుమికూడడం, నినాదాలు చేయడం, లౌడ్ స్పీకర్లు, డీజేలు, సౌండ్ బాక్స్‌లు, ఇతర శబ్ద విస్తరణ పరికరాల వినియోగం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. ఈ ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలోని అన్ని కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు, సీసీటీవీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. అనుమానాస్పద కదలికలపై నిఘా కోసం ప్రత్యేక పర్యవేక్షణ బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని, అలాగే సున్నిత ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించి ఎలాంటి అవాంఛ నీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, డీజే యజమానులు, ఈవెంట్ నిర్వాహకులు పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని, ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తూ ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా, శాంతియుతంగా పూర్తయ్యేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎస్పీ కోరారు.

# పట్టు వస్త్రాలు సమర్పించిన పాపిరెడ్డి దంపతులు



**భారతీయ వెలుగు,తూ.గో.జిల్లా ప్రతినిధి(సత్తి వెంకటరెడ్డి,అనపర్తి/గొల్లల మామిడాడ):**
పెదపూడి మండలం గొల్లల మామిడాడ(బిక్కవోలు వెళ్ళే రోడ్డు) లో గల మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి 33 వ దివ్య కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గురువారం వంశ పారంపర్య ధర్మకర్త, చైర్మన్ ద్వారంపూడి వీర్రాఘవులు అనే పాపిరెడ్డి (డివిఆర్‌ఏ పాపిరెడ్డి) సత్యవతి దంపతులు స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు.ఆలయ అర్చకులు కళ్యాణ క్రతువులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.భక్తులు స్వామివారి కల్యాణాన్ని కనులారా వీక్షించి భక్తి పరవశమయ్యారు. స్వామివారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.భారీగా బాణసంచా కాల్చడం జరిగింది.ఈ సందర్భంగా వీర్రాఘవులు మాట్లాడుతూ రూ.15 లక్షల వ్యయంతో ఇటీవల ఆలయ పునర్నిర్మాణం, అభివృద్ధికి కృషి చేయడం జరిగిందని తెలిపారు.ఈ నెల 15 న మహాశివరాత్రి ఉత్సవాలు ప్రతి ఏడు జరుపుతున్న విధంగానే ఘనంగా నిర్వహించడం జరుగుతుందని వీర్రాఘవులు తెలిపారు.ఈ కార్యక్రమంలో రామచంద్రారెడ్డి విమలా రెడ్డి దంపతులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

# మున్సిపోల్స్ : కాంగ్రెస్ హుషారు -- బీఆర్ఎస్, బీజేపీ దిగాలు!

**భారతి తెలుగు ప్రతినిధి హైదరాబాద్**
తెలంగాణలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో జరిగిన ఎన్నికల్లో దాదాపు 70 శాతానికి పైగా పోలింగ్ నమోదు అయింది. ఈ ఎన్నికలు అనధికార రిఫరెండమే. పట్టణ ప్రజల పల్స్ తెలుస్తుంది. సాధారణంగా స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీకి ఉండే సానుకూలత ఈసారి కూడా కాంగ్రెస్‌కు స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, పట్టణ పరిపాలనపై తీసుకుంటున్న నిర్ణయాలు ఓటర్లను ప్రభావితం చేసినట్లు తెలుస్తోంది. సుమారు 80 శాతానికి పైగా మున్సిపాలిటీలను గెలుచుకుంటామన్న కాంగ్రెస్ ధీమా ఫలితాల్లోనూ ప్రతిబింబించే అవకాశం ఉంది.

**రెండో స్థానం కోసం హోరాహోరీ -- బీఆర్ఎస్ వర్సెస్ బీజేపీ**

మున్సిపాలిటీల్లో అధికార కాంగ్రెస్ తర్వాత రెండో స్థానంలో ఎవరు నిలుస్తారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. క్షేత్రస్థాయిలో ఉన్న బలమైన కేడర్ , గత పదేళ్ల పాలన గుర్తింపుతో బీఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటీల్లో రెండో స్థానాన్ని నిలబెట్టుకునేలా కనిపిస్తోంది. అయితే, బీజేపీ కొన్ని పట్టణ



ప్రాంతాల్లో పుంజుకున్నప్పటికీ, రాష్ట్రవ్యాప్తంగా చూస్తే అది నామమాత్రపు పోటీకే పరిమితమయ్యే సూచనలు ఉన్నాయి. బీజేపీ తన బలాన్ని నిరూపించుకోవడానికి ప్రయత్నించినప్పటికీ, సంస్థాగత నిర్మాణం గట్టిగా ఉన్న మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ తన ఉనికిని చాటుకోనుంది. కనీసం ఇరవై మున్సిపాలిటీలు గెల్చుకునే అవకాశాలు ఉన్నాయని ఆ పార్టీ ప్రాథమికంగా అంచనాకు వచ్చింది.

**కార్పొరేషన్లలో మారుతున్న సమీకరణాలు**

ఏడు మున్సిపల్ కార్పొరేషన్లలో పరిస్థితి మున్సిపాలిటీలకు భిన్నంగా ఉంది. ఇక్కడ బీఆర్ఎస్ ఉనికి ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం కనిపిస్తోంది. ఐదు కార్పొరేషన్లలో కాంగ్రెస్ ఏకపక్షంగా దూసుకుపోయే అవకాశం ఉండగా, రెండు చోట్ల బీజేపీ గట్టి పోటీనిస్తోంది. ముఖ్యంగా కరీంనగర్, నిజామాబాద్ వంటి పట్టణాల్లో మతపరమైన , రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారాయి. ఇక్కడ మజ్లిస్ ( పార్టీ నిర్ణయాత్మక శక్తిగా మారనుంది. మజ్లిస్ మద్దతుతో కాంగ్రెస్ లేదా కాంగ్రెస్ పరోక్ష సహకారంతో మజ్లిస్ మేయర్ పీఠాలను కైవసం చేసుకునే వ్యూహాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

**బీఆర్ఎస్ దీన స్థితికి నిదర్శనమా?**

ఈ ఎన్నికల ఫలితాలు బీఆర్ఎస్ చెబుతున్నట్లుగా ప్రభుత్వ వ్యతిరేకతను ప్రతిబింబించడం కంటే, ఆ పార్టీ సొంత బలహీనతలను బయటపెట్టేలా ఉండనున్నాయి. వరుస ఓటములతో కుంగిపోయిన కేడర్‌లో ఉత్సాహం నింపేందుకు ఈ ఎన్నికలు ఒక అవకాశంగా భావించినా, ఫలితాలు ఆ పార్టీకి ఇబ్బందికరంగా ఉండే అవకాశం ఉంది. మొత్తంగా చూస్తే, తెలంగాణ ఓటర్లు ప్రభుత్వం మార్పు తర్వాత కనీసం రెండేళ్ల పాటు అదే ధోరణిని కొనసాగించాలని కోరుకుంటున్నట్లు ఈ పోలింగ్ సరళి స్పష్టం చేస్తోంది. ఫలితాలను బట్టి రాజకీయాలు మారనున్నాయి. శుక్రవారం తెలంగాణ రాకీయాల్లో ఓ బిగ్ డే అనుకోవచ్చు.

# మేడారం మహాజాతర హుండీ లెక్కింపు పూర్తి

» 828 హుండీలతో రూ.13.25 కోట్ల ఆదాయం
» విదేశీ కరెన్సీ, బంగారం, వెండి లభ్యం



**భారతీయ వెలుగు ప్రతినిధి హనుమకొండ, ఫిబ్రవరి 12:**
ప్రపంచ ప్రఖ్యాత మేడారం సమ్మక్క--సారలమ్మ మహాజాతర హుండీ లెక్కింపు ప్రక్రియ బుధవారంతో ముగిసింది. ఈ నెల 5వ తేదీ నుంచి హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన లెక్కింపులో మొత్తం 828 హుండీలను తెరిచి నగదు, ఆభరణాలను లెక్కించారు.
వారం రోజుల పాటు సుమారు 400 మంది సిబ్బంది దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య లెక్కింపు చేపట్టారు. మొత్తం రూ.13,25,83,269 ఆదాయం లభించినట్లు అధికారులు వెల్లడించారు. హుండీల్లో నగదుతో పాటు విదేశీ కరెన్సీ, రద్దు నోట్లు, బంగారం, వెండి ఆభరణాలు కూడా లభించాయి.
గత మహాజాతరలో 540 హుండీల ద్వారా రూ.13.25 కోట్ల ఆదాయం నమోదవగా, ఈసారి 828 హుండీలు ఏర్పాటు చేసినప్పటికీ దాదాపు సమాన స్థాయిలోనే ఆదాయం రావడం విశేషం. హుండీల సంఖ్య గణనీయంగా పెరిగినా ఆదాయం పెరుగుదల పరిమితంగానే ఉండటం గమనార్హమని అధికారులు పేర్కొన్నారు.
భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచే మేడారం జాతరలో లక్షలాది మంది పాల్గొనగా, హుండీ ఆదాయం కూడా భారీ స్థాయిలో నమోదవడం దేవాలయ అభివృద్ధి కార్యక్రమాలకు తోడ్పడనుంది. లభించిన నగదు, ఆభరణాలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం బ్యాంకుల్లో జమ చేయనున్నట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

# ఘనంగా మహర్షి దయానంద సరస్వతి జయంతి

» విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు, పెన్నులు,పెన్సిళ్లు, పంపిణీ
» రామప్రభు, చైర్మన్,అట్టేపల్లి చారిటబుల్ ట్రస్ట్
» పరీక్షలు రాసేటప్పుడు విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికావద్దు

**భారతీయ వెలుగు శేరిలింగంపల్లి**
పరీక్షలు రాసేటప్పుడు విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికావద్దని ధైర్యంగా పరీక్షలు రాసినప్పుడే వాటంత అవి ఫలితాలు వస్తాయని అట్టేపల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రాం ప్రభువు అన్నారు. వచ్చే పదవ తరగతి పరీక్షలు విద్యార్థులు సునాయాసంగా ఉపాధ్యాయులు చెప్పిన సూచనలను పాటిస్తే పరీక్షలలో విజయాలు సాధిస్తారని విద్యార్థులకు తెలిపారు.
మహర్షి దయానంద సరస్వతి జయంతిని పురస్కరించుకొని (12 ఫిబ్రవరి) ఉదయం 11 గంటలకు స్థానిక మియాపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో అట్టేపల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ






కార్యక్రమం నిర్వహించబడింది.
ఈ కార్యక్రమంలో అట్టేపల్లి రామప్రభు, చైర్మన్, అట్టేపల్లి లక్ష్మీనారాయణ ట్రస్ట్ వారు ఏడో తరగతి నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు,



పెన్నులు,పెన్సిళ్లు, షార్ప్‌నర్లు, స్కేల్స్ తదితర పరీక్షా సామగ్రిని అందజేశారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి, రాబోయే కాలంలో ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో ఏఆర్పి టీమ్మ్ సభ్యులతో పాటు ముఖ్య అతిథిగా స్థానిక నాయకులు శ్రీ ఓంప్రకాష్ గౌడ్ హాజరయ్యారు. అలాగే పాఠశాల హెడ్మాస్టర్ వసుంధర దేవి , ప్రీ-ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్ హుస్సేన్ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.
విద్యాభివృద్ధి లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల నుంచి ప్రశంసలు అందుకుంది.

# లేబర్ కోడ్లతో కార్మిక హక్కుల హత్య

» హైర్ అండ్ ఫైర్ తో శ్రమ దోపిడీకి చట్టబద్ధత కల్పించడమే...
» కార్మికుడి కడుపు ఆకలినీ తీర్చని కేంద్ర దీయజూ ప్రభుత్వం...
» కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అడ్డుకోవడానికి కార్మికులంతా ఏకం కావాలి
» సీఐటీయూ జిల్లా కార్యదర్శి +.సాయిలు...
» జహీరాబాద్ లో కార్మికుల సమ్మెతో పరిశ్రమల బంద్, జ×ుఖ భారీ ప్రదర్శన, బైక్ ర్యాలీలు, » రాస్తా రోకో నాయకుల అరెస్ట్...

జహీరాబాద్ భారతీయ వెలుగు ప్రతినిధి
ఫిబ్రవరి 12







కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లతో కార్మికుల హక్కుల హత్య చేయబడతాయని, హైర్ అండ్ ఫైర్ తో శ్రమ దోపిడీకి చట్టబద్ధత కల్పించడమే తప్ప మరోటి కాదని, తక్షణమే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు అన్నారు. ఈరోజు దేశవ్యాప్త సమ్మెలో భాగంగా జహీరాబాద్ లో భారీ బైక్ ర్యాలీలు, భారీ కార్మిక ప్రదర్శన, రాస్తా రోకో నిర్వహించడం జరిగింది. అంతకు ముందు జఱజ కార్యాలయం ఎదుట సభ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సాయిలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అడ్డుకోవడానికి కార్మికులంతా ఏకం కావాలన్నారు. ఇప్పటివరకు ఉన్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, కార్మికులను మరింతగా దోచుకునే విధంగా లేబర్ కోడ్లు రూపొందించారని అన్నారు. లేబర్ కోడ్ల ద్వారా వేతనాల నిర్ణయంలో ఉన్న త్రైపాక్షిక విధానాన్ని రద్దు చేసి, 'ఒకే దేశం ఒకే వేతనం' పేరుతో రోజుకు రూ.178 కనీస వేతనం నిర్ణయించడం ద్వారా కార్మికుల ఆదాయం తగ్గే పరిస్థితి ఏర్పడిందని, అలాగే పని గంటలను 8 నుంచి 12కు పెంచి, ఓవర్టైంకు అదనపు వేతనం చెల్లించకుండా చేస్తున్నారని ట్రేడ్ యూనియన్ నమోదు నిబంధనలను కఠినతరం చేసి, కార్మికుల సంఘటిత శక్తిని దెబ్బతీస్తున్నయని పరిశ్రమల లేఆఫ్, లాకౌట్, మూసివేతలకు సంబంధించిన నిబంధనలను సడలించి, యజమానులకు అనుకూలంగా మార్చారని, ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్ వంటి హక్కులను కాంట్రాక్ట్ కార్మికుల నుంచి క్రమంగా తొలగించే విధంగా కోడ్లు రూపొందించారని అనేక రాష్ట్రాల్లో ఉన్న కార్మిక సంక్షేమ బోర్డులను రద్దు చేసి, కార్మికుల విద్య, వైద్యం, వివాహ, ప్రసూతి సహాయాలను నిలిపివేయడానికి ప్రభుత్వం కుట్ర చేస్తోందని, వ్యవసాయ చట్టాలను రద్దు చేసినట్లు ప్రకటించినప్పటికీ దొడ్డిదారిగా అమలు చేస్తున్నారని రైతుకు గిట్టుబాటు ధర లేకుండా ఎరువులు పురుగుమందులు విత్తనాలు దారుల పెంచి రైతులకు మోసం చేస్తుందని,ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడంతో గ్రామీణ పేదలకు ఉపాధి భరోసా లేకుండా పోయిందని లేబర్ కోడ్ల ద్వారా తనిఖీ వ్యవస్థను నిర్వీర్యం చేసి, కార్మికులకు శిక్ష యజమానులకు రక్ష అనే విధానాన్ని అమలు చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. సామాన్య ప్రజలను విస్మరించి, కేవలం సంపన్నుల ప్రయోజనాల కోసమే కేంద్రం నిర్ణయాలు తీసుకుంటోందన్నారు.
చట్టబద్ధంగా లభించాల్సిన సౌకర్యాలు అందనప్పుడు, శాంతియుత నిరసనలు మరియు సమ్మెలు కార్మికుల ఆయుధాలన్నారు. రేపు పొద్దున మన ఉద్యోగం ఉంటుందో లేదో తెలియని స్థితిలో కార్మికుడు నిరంతరం భయం భయంగా గడపాల్సి వస్తుందన్నారూ. ఉద్యోగం పోతుందనో, వేతనం తగ్గుతుందనో భయపడితే యజమాన్యాలు మరింత అణిచివేస్తాయి. కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమ్మెతో మోడీ ప్రభుత్వం కళ్ళు తెరవాలన్నారు.
ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహిపాల్, వివిధ యూనియన్స్, రంగాల నాయకులు నరేష్, మహేశ్వర్, నర్సయ్య, శశికళ,గౌరమ్మ, నాగమణి, సందీప్ రెడ్డి, వహాబొద్దీన్, నందమ్మ, అంజమ్మ, యశోద, ఎల్లప్ప, నారాయణ, ఆనంద్, స్వరూప, వంశీ, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## కెపిహెచ్బి లో ఘనంగా జనసేన పార్టీ ఇంచార్జ్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ పుట్టినరోజు వేడుకలు....



భారతీయ వెలుగు ప్రతినిధి కూకట్పల్లి
కేపీహెచ్బీ కాలనీ 5వ ఫేస్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో కూకట్‌పల్లి నియోజకవర్గ జనసేన పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ పుట్టినరోజు వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. పార్టీ శ్రేణులు, అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి జనసైనికులు, వీర మహిళలు, మిత్రులు, శ్రేయోభిలాషులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కాలనీవాసులు, వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు హాజరై ముమ్మారెడ్డి ప్రేమ కుమార్‌కు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి, బొకేలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ కార్యాలయం వద్ద సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ ప్రత్యక్షంగా, పరోక్షంగా, అలాగే వివిధ ప్రచార మాధ్యమాల ద్వారా శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆశీస్సులు, అభిమానమే తనకు బలమని, ప్రజాసేవలో మరింత కట్టుబాటుతో పనిచేస్తానని పేర్కొన్నారు.

## సంత్ శిరోమణి జగద్గురు రవిదాస్ జీ సేవలో చిరస్మరణీయం... వడ్డేపల్లి రాజేశ్వరరావు





భారతీయ వెలుగు ప్రతినిధి కూకట్పల్లి
సంత్ శిరోమణి జగద్గురు రవిదాస్ జీ మహారాజ్ సమాజానికి సమానత్వం, ఐక్యత వంటి గొప్ప విలువలను బోధించిన మహనీయుడని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పేర్కొన్నారు. సంత్ రవిదాస్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని గురువారం మూసాపేట్ జనతా నగర్, మోచి బస్తీలోని గురు రవిదాస్ జీ ఆలయాన్ని మోచి సంఘం వారి ఆహ్వానం మేరకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు విచ్చేసి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. వారి ఆహ్వానాన్ని మన్నించి ఆలయ సందర్శనకు విచ్చేసిన వడ్డేపల్లి రాజేశ్వరరావుని మూసాపేట్ మోచి కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.
అనంతరం వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ సంత్ శిరోమణి జగద్గురు రవిదాస్ జీ మహారాజ్ సమాజానికి సమానత్వం, మానవత్వం, ఐక్యత వంటి గొప్ప విలువలను బోధించిన మహనీయుడని పేర్కొన్నారు. కుల, మత భేదాలు లేకుండా అందరూ సమానమే అనే సందేశాన్ని తన జీవితంతోనే చూపించిన మహాపురుషుడని కొనియాడారు. సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి సంత్ రవిదాస్ జీ చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన బోధనలు నేటి యువత తప్పక ఆచరించాల్సినవని తెలిపారు.ఆలయ అభివృద్ధి కోసం తన వంతు సహకారం ఉంటుందని రాజేశ్వరరావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మూసాపేట్ డివిజన్ సీనియర్ బిజెపి నాయకులు కర్మాడాకయ్య, ఐలయ్య యాదవ్, శేఖర్ గుప్తా, సాయి,మోచి కమిటీ నాయకులు, స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పోలీస్ పెట్రోలింగ్ కారు ఢీకొని యువతి మృతి

**– రెండేళ్ల తరవాత జాహ్నవికి భారీ పరిహారం**

అమెరికాలో ఓ బాధ్యత గల పోలీసు అధికారి నిర్లక్ష్యం వల్ల రోడ్డు ప్రమాదంలో మరణించిన కర్నూలు యువతి కందుల జాహ్నవి(23) అనే యువతి కుటుంబానికి న్యాయం జరిగింది. నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీస్ అధికారిని విధులనుంచి తొలగించడంతో పాటు మృతురాలు కుటుంబానికి అక్కడి ప్రభుత్వం రూ.262 కోట్ల భారీ పరిహారాన్ని ఇవ్వనున్నట్లు ప్రకటించింది. కర్నూలు జిల్లాకు చెందిన జాహ్నవి పై చదువుల కోసం అమెరికా వెళ్లింది. 2023 జనవరిలో సియాటెల్ నగరంలో రోడ్డు దాటుతున్న జాహ్నవిని పోలీస్ పెట్రోలింగ్ కారు ఢీకొట్టిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో జాహ్నవి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ప్రమాదానికి కారణమైన డేనియల్ అడరర్ అనే పోలీసు అధికారి కనీసం బాధ్యతగా ప్రవర్తించక పోగా ఎగతాలిగా మాట్లాడారు. ఆమె చనిపోయింది, ఆమె చాలా మాములు మనిషి, 11 వేల డాలర్లు ఇస్తే సరిపోతుంది హహహ ' అంటూ ఎగతాలిగా మాట్లాడాడు. కారుతో ఢీకొట్టి కనీసం పాశ్చాతాపం లేకండా వెకిలిగా ప్రవర్తించిన అధికారిపై సియాటెల్ నగర యంత్రాంగ చర్యలు తీసుకంది

## దశబ్దాలుగా కష్టపడి అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 4 కోడ్ లుగా చేసి కార్మికులను బానిసలుగా చేసే చట్టాలను రద్దు చేయాలి...

**– పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం డిమాండ్.**



భారతీయ వెలుగు ప్రతినిధి కూకట్పల్లి
దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక కార్మికులు వారి హక్కులు, ఉద్యోగ భద్రతను దెబ్బతీసే నూతన లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలి టిపిసిసి అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం డిమాండ్ చేశారు.కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం త్వరలో అమలు చేయబోతున్న నాలుగు లేబర్ కోడ్ లు కార్మిక రంగానికి ఉరితాళ్లుగా మారబోతున్నాయని వీటిని వెంటనే ఉపసంహరించుకోకపోతే కార్మిక వర్గాల నుండి నిరంతర నిరసన ఎదుర్కోవాల్సి వస్తుందని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల పిలుపుతో తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా కూకట్ పల్లి నియోజకవర్గం బాలానగర్ నర్సాపూర్ చౌరస్తా లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక సంఘాలు ఐఎన్ టియుసి, సిఐటియు, ఏఐటియుసి,హెచ్ఎమ్ఎస్, టియుసిఐ, టిఎన్ టియుసి, బిఆర్ టియు, ఏఐయుటియుసి, ఇతర ఫెడరేషన్ల తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ విభాగమైన లేబర్ సెల్ ఆధ్వర్యంలో జరిగిన అఖిల భారత సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయడానికి తెలంగాణ కాంగ్రెస్ పార్టీ తరపున పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం ధర్నాలో పాల్గొని మద్దత్తును తెలియజేసారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకగా నిలుస్తున్న కార్మిక లోకాన్ని అణిచివేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆరోపించారు. కార్మికుల ప్రాథమిక హక్కులను కాలరాస్తూ.. పరిశ్రమలలో యూనియన్లు లేకుండా చేసి.. పెట్టుబడిదారి వర్గాలకు అనుకూలంగా నూతన లేబర్ కోడ్లు రూపొందించిందని దుయ్యబట్టారు. వీటిని అమలు చేసేందుకు 2025 డిసెంబర్ శీతాకాల సమావేశాల్లోనే కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసిందని పేర్కొన్నారు. ఈ చట్టాల ద్వారా వెనకబడిన, బలహీన వర్గాల వరకు ఉద్యోగ అవకాశాలు ఈ చట్టాల ద్వారా అనేకమంది కార్మికులు వారి ఉద్యోగాలను కోల్పోతున్నారు అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోకపోతే దేశవ్యాప్తంగా నిరవధిక సమ్మెకు కార్మికుల సిద్ధమవుతారని హెచ్చరించారు. ఉద్యోగ, సామజిక భద్రత, రక్షణ యూనియన్ హక్కులను దెబ్బతీస్తున్న నాలుగు కార్మిక కోడ్ లను వెంటనే రద్దు చేయాలనీ, వీబీ జీ రామ్ జీ చట్టాన్ని రద్దు చేసి మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలని, ప్రభుత్వ రంగ సంస్థలైన ఎల్ఐసి లో ప్రైవేటు భాగస్వామ్యాన్ని నిలిపివేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, దశబ్దాలుగా కష్టపడి సంపాదించుకున్న కార్మికుల రక్షణను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూల్చివేసిందని అన్నారు. ఈ నిరసనలో కార్మిక సంఘాల ప్రతినిధులతో పాటు పెద్ద ఎత్తున కాంగ్రెస్ శ్రేణులు పాల్గొని కేంద్ర నిర్ణయాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వెంకట్ నర్సయ్య, ఎం. శంకర్, ఏ. విజయ, చైతన్య, రాజశేఖర్ ఐలాపురం, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, రమణ, నాగరాజు, సుదర్శన్ రెడ్డి, సప్పుడి భాస్కర్, నరసింహ యాదవ్, తూము మనోజ్, తూము రజినీకాంత్, జ్యోతి, జోజమ్మ, చిన్నారావు, అనిత, సబియా, పి. శంకర్, రాములు, రజియా వివిధ కార్మిక సంఘల నాయకులు తదితరులు పెద్ద ఎత్తున హాజరైనారు.

## పరిశ్రమలలో అగ్ని ప్రమాదాలపై అప్రమత్తం

**– అధికార యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకోవాలి**
**– ముందు జాగ్రత్త చర్యలపై అధికారులతో సిఎస్ సమీక్ష**

భారీ పరిశ్రమలలో అగ్ని ప్రమాదాల నివారణకు, కార్మికుల భద్రతకు ప్రభుత్వ యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణరావు ఉన్నతాధికారులను ఆదేశించారు. అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలు, చర్యలపై స్పష్టమైన ఒక మాన్యువల్ ను సిద్ధం చేయాలని సి.ఎస్ ఆదేశించారు. గురువారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సిగాచి ఇండస్ట్రీస్‌లో జరిగిన దుర్ఘటన పై ఇప్పటి వరకు తీసుకున్న చర్యలను సంబంధిత అధికారులతో సి.ఎస్ సమీక్షించారు. ఈ ప్రమాదంలో మరణించిన కార్మికుల, బాధిత కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా చెల్లింపులు, కోర్టు కేసుల పురోగతిపై సంబంధిత విభాగాల ఉన్నతాధి కారులతో సి.ఎస్ సమీక్ష చేశారు. ఈసందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా భారీ, మధ్యతర, చిన్నతరహా పరిశ్రమలలో రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయిలలో వివిధ విభాగాలు సమన్వయంతో తనిఖీలు నిర్వహించుకోవడానికి జాయింట్ ఇన్స్పెక్షన్ టీమ్స్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పరిశ్రమలలో అగ్ని ప్రమాదాల నివారణకు రెగ్యులర్ మానిటరింగ్ ఉండే విధంగా అధికారులతో తనిఖీ నిర్వహించాలని అన్నారు. జిల్లా స్థాయిలో రెవెన్యూ, పోలీస్, పరిశ్రమలు, కార్మిక, వైద్య ఆరోగ్య, అగ్నిమాపక, కాలుష్య నియంత్రణ మండలి శాఖల అధికారులతో కూడిన తనిఖీ బృందాలను ఏర్పాటు చేయాలని అన్నారు. ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి ఆ వివరాలను ఆన్ లైన్ లో పొందుపరిస్తే అన్ని విభాగాల అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందని సి.ఎస్ అన్నారు. పరిశ్రమలలో భద్రతా ప్రమాణాలు, భద్రతా ఆడిట్, అలాగే కార్మికుల భద్రతకు సంబంధించి శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలని సి.ఎస్ సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు అరవింద్ కుమార్, సంజయ్ కుమార్, దాన కిషోర్, ౧÷ర్ సర్వీస్స్ డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్, సంగారెడ్డి కలెక్టర్ ప్రవీణ్య, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఈఅఆం) కమిషనర్ శశాంక, కాలుష్య నియంత్రణ మండలి మెంబర్ సెక్రటరీ రవి, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

## సింగరేణి సిఎండిగా బుద్ధప్రకాశ్ బాధ్యతలు

సింగరేణి సంస్థ చైర్మన్, ఎండీగా నియమితులైన సీనియర్ ఐఏఎస్ అధికారి డాక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాష్ గురువారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో అధికారిక బాధ్యతలు స్వీకరించారు. 2002 బ్యాచ్ తెలంగాణ కేడర్‌కు చెందిన బుద్ధ ప్రకాష్ గతంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖకు ప్రభుత్వ కార్యదర్శిగా పనిచేశారు. రవాణా, భూమి రికార్డులు , సామాజిక సంక్షేమంలో విస్తృత అనుభవం ఆయనకు ఉంది. రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపుల కమిషనర్ , ఇన్‌స్పెక్టర్ జనరల్, సర్వే సెటిల్మెంట్లు అండ్ ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్ , భూభారతి ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు.

## లాటరీ టిక్కెట్ల కేసులో రిమాండ్ రాజమండ్రి జైలుకు అంబటి తరలింపు

వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు కోర్టు మరోసారి 14 రోజుల రిమాండ్ విధించింది. ఈ మేరకు గుంటూరు స్పెషల్ ప్రిన్సిపల్ కోర్టు న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. సంక్రాంతి పండగ వేళ.. సత్తెనపల్లిలో లక్కీ డ్రా పేరుతో బలవంతంగా టికెట్లు కొనుగోలు చేసేలా వ్యవహరించిన కేసులో అంబటి రాంబాబుకు న్యాయమూర్తి ఈ రిమాండ్ విధించారు. ఈ నేపథ్యంలో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు అంబటి రాంబాబును భారీ బందోబస్తు నడుమ తరలించారు. సంక్రాంతి పండగ వేళ సత్తెనపల్లిలో లక్కీ డ్రా పేరుతో టికెట్లు విక్రయించారు. వీటిని ప్రజలకు వైసీపీ నేత అంబటి రాంబాబు బలవంతంగా విక్రయించేలా చర్యలు చేపట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఆయనపై జనసేన పార్టీకి చెందిన నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో అంబటిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇటీవల సీఎం చంద్రబాబుపై అంబటి రాంబాబు తీవ్ర అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. దాంతో రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో అంబటిపై పోలీసులకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ మేరకు అంబటిపై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. అనంతరం రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. తాజాగా లక్కీ డ్రా కేసులో ఈ రోజు గుంటూరు కోర్టులో అంబటిని సత్తెనపల్లి పోలీసులు హాజరుపరిచారు. ఆయనకు 14 రోజుల రిమాండ్ విధిస్తూ.. స్పెషల్ ప్రిన్సిపల్ కోర్టు న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. దాంతో గుంటూరు నుంచి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు ఆయన్ని తరలించారు.

## గవర్నర్ ప్రసంగంపై చర్చ ప్రారంభం ఉభయ సభలు నేటికి వాయిదా

ఆంధ్రప్రదేశ్ శాసనసభ, శాసన మండలి వాయిదా పడ్డాయి. శాసనసభ వాయిదా పడిన కొద్దిసేపటికే శాసనమండలి సైతం శుక్రవారానికి వాయిదా పడింది. గురువారం ఉదయం రెండు సభలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఇరు సభల్లో గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరిగింది. ఇక శాసన మండలిలో అధికార, విపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. మంత్రి పార్థసారథి, వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ మధ్య మాటల యుద్ధం చోటు చేసుకుంది. ఒకానొక దశలో ఈ ఇరువురు ఒకరిపై ఒకరు ఛాలెంజ్ చేసుకునే వరకు పరిస్థితి వెళ్లింది. దాంతో సభలో తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో శాసన మండలి శుక్రవారానికి వాయిదా వేస్తున్నట్లు ఛైర్మన్ మోషేన్ రాజు ప్రకటించారు. సమావేశాల ప్రారంభం వేళ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ప్రసంగించారు. ఈ సమావేశానికి వైసీపీ ఎమ్మెల్యేలు మొత్తం 11మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా సభలో పెద్దఎత్తున వారు నినాదాలు, నిరసనలు తెలిపారు. సభ ప్రారంభమైన కొన్ని నిమిషాలకే వైసీపీ సభ్యులంతా వాకౌట్ చేశారు. గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై గురువారం చర్చ జరిగింది. అనంతరం సభ శుక్రవారానికి వాయిదా పడింది. మరోవైపు బుధవారం నాడు అసెంబ్లీలో వైసీపీ ఎమ్మెల్యేలు అనుసరించి తీరు పట్ల స్పీకర్ అయ్యన్నపాత్రుడు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. వైసీపీ వాళ్లకి 11 అసెంబ్లీ సీట్లు వచ్చాయని.. అసెంబ్లీకి 11వ తేదీన వచ్చారని.. కేవలం 11 నిమిషాలసేపు సభలో వారు ఉన్నారంటూ స్పీకర్ వ్యంగ్యంగా పేర్కొన్నారు.

# క్రీడలు యువతలో పోరాట పటిమను పెంపొందిస్తాయి

» ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్

» కేసీఆర్ క్రికెట్ కప్ 2026 -- 8వ సీజన్ ఘన ప్రారంభం

» 40కు పైగా జట్లతో ఐదు రోజుల పాటు అంగరంగ వైభవంగా పోటీలు





**భారతీయ వెలుగు చీఫ్ బ్యూరో, ఫిబ్రవరి 12**
క్రీడలు యువత లో యువత శారీరక, మానసిక దృఢత్వానికి క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. గురువారం కాకతీయ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, రాష్ట్ర సాధకుడు శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న "కేసీఆర్ క్రికెట్ కప్ 2026 -- 8వ సీజన్" గురువారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ఘనంగా ప్రారంభమైంది. క్రీడా ఉత్సాహంతో నిండిన వాతావరణంలో ఈ టోర్నమెంట్‌కు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ హాజరై పోటీలను అధికారికంగా ప్రారంభించారు. ముందుగా జెండా ఆవిష్కరణ చేసి, క్రీడాకారులను పరిచయం చేసుకొని, ప్రారంభ బంతి వేసి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ పాత్ర అపూర్వమని పేర్కొన్నారు. ఉద్యమకారుడు, రాష్ట్ర నిర్మాణ శిల్పి, అభివృద్ధి ప్రదాతగా కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని రంగాలలో ముందుకు తీసుకెళ్లారని కొనియాడారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. క్రీడలు యువతకు క్రమశిక్షణ, ఐక్యత, నాయకత్వ లక్షణాలు నేర్పుతాయని, గ్రామీణ కింది స్థాయిలో ఉన్న ప్రతిభావంతులైన యువ క్రీడాకారులను వెలికి తీసి వారికి వేదిక కల్పించాలనే లక్ష్యంతో ఈ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఈ టోర్నమెంట్ ప్రస్తుతం 8వ సీజన్‌కు చేరుకోవడం గర్వకారణమని తెలిపారు. చిన్న స్థాయిలో ప్రారంభమైన ఈ పోటీలు, ఇప్పుడు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన క్రీడా వేదికగా మారాయని చెప్పారు. అనేక క్రీడా టోర్నమెంట్లకు మార్గదర్శకంగా నిలుస్తూ, యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తున్నాయని అభిప్రాయపడ్డారు. ఈ టోర్నమెంట్‌ను ప్రతి సంవత్సరం విజయవంతంగా నిర్వహిస్తున్న కేసీఆర్ ఆర్గనైజర్స్ మరియు కాకతీయ క్రికెట్ అకాడమీ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. కాగా ఈ టోర్నమెంట్ ఐదు రోజుల పాటు అంగరంగ వైభవంగా కొనసాగనుంది. దాదాపు 40కు పైగా జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయన్నారు. ప్రతి మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగి ప్రేక్షకులను అలరించనుందని నిర్వాహకులు తెలిపారు. యువకులు, విద్యార్థులు క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై పోటీలను వీక్షించి, క్రీడాకారులను ప్రోత్సహించాలని ఆయన కోరారు. ఈ టోర్నమెంట్ ద్వారా భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో మెరుస్తున్న క్రీడా కారులు తయారవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ టోర్నమెంట్‌లో విజేతలకు ఆకర్షణీయమైన నగదు బహుమతులు ప్రకటించారు. మొదటి బహుమతి: ?51,116/- రెండవ బహుమతి: ?31,116/- అదనంగా, ఉత్తమ బ్యాట్స్‌మన్, ఉత్తమ బౌలర్, ఉత్తమ ఆల్‌రౌండర్ మరియు మాన్ ఆఫ్ ది మ్యాచ్‌లకు ప్రత్యేక బహుమతులు కూడా అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూడా మాజీ చైర్మన్ మర్రి యాదవ్ రెడ్డి, నిర్వాహకులు షాకీర్, అస్లాం, వీరు, సిరాజ్, రాజేష్, రాంబాబు, కార్పొరేటర్స్ డివిజన్ ప్రెసిడెంట్ మాజీ కార్పొరేటర్స్,క్రీడా సంఘాల ప్రతినిధులు, యువకులు, విద్యార్థులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

# బీజేపీ మోడీ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ.. కార్మిక సంఘాలు వరంగల్‌లో భారీ ర్యాలీ

**భారతీయ వెలుగు వరంగల్, ఫిబ్రవరి 12**
దేశంలో కార్మికుల హక్కులను క్రమంగా హరించే విధంగా బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలకు నివసిస్తూ.. కార్మిక సంఘాలు గురువారం దేశవ్యాప్తంగా భారత్ బంద్ నిర్వహించారు. ఈ బంద్‌లో భాగంగా వరంగల్‌లో రైల్వే స్టేషన్ నుంచి చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రేటర్ వరంగల్ తొలి మేయర్, వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ హాజరయ్యారు.వేలాదిమంది కార్మికులు,రైతుల పాల్గొనడం ఈ ర్యాలీలో వేలాదిమంది కార్మికులు, రైతులు పాల్గొని "మోడీ కార్మిక వ్యతిరేక విధానాలు మానాలి", "బీజేపీ దోపిడీ పాలనకు చరమగీతం పలకాలి" అంటూ నినాదాలు చేశారు. దేశాన్ని కార్పొరేట్లకు తాకట్టు పెట్టారు,నరేందర్ ర్యాలీ అనంతరం నన్నపునేని



నరేందర్ మాట్లాడుతూ,దేశాన్ని కార్పొరేట్లకు తాకట్టు పెట్టిన బీజేపీ ప్రభుత్వం కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని మండిపడ్డారు. మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కార్మిక కోడ్‌లు కార్మికులను బానిసలుగా మార్చే కుట్ర తప్ప మరొకటి కాదని స్పష్టం చేశారు. ఉద్యోగ భద్రత లేకుండా చేయడం,పని గంటలు పెంచడం,సంఘాల హక్కులను హరించడం బీజేపీ పాలనలో సాధారణమైందని విమర్శించారు.దేశ సంపద కొద్దిమంది కార్పొరేట్ల చేతుల్లోకి వెళ్లిపోతుంటే కార్మికుడు ఆకలి, నిరుద్యోగంతో కొట్టుమిట్టాడుతున్నాడని అన్నారు. పోరాటాలకు పూర్తి సంఘీభావం బీజేపీ మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మికుల పోరాటాలకు తమ పూర్తి సంఘీభావం ఉంటుందని, ఈ ఉద్యమం మరింత ఉధృతం కావాల్సిన అవసరం ఉందని పిలుపు నిచ్చారు.పాల్గొన్నవారు ఈ ర్యాలీలో కార్మిక సంఘాల నాయకులు,రైతు సంఘ నాయకులు,ఆటో కార్మికులు,మహిళా కార్మికులు,వివిధ రంగాలకు చెందిన ఉద్యోగులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు,తూర్పు నియోజకవర్గం డివిజన్ అధ్యక్షులు,యువజన నాయకులు,మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 15న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి 32వ అఖండ జ్యోతి రథయాత్ర

– యాత్ర కమిటీ చైర్మన్ సద్ది వెంకట్ రెడ్డి

**భారతీయ వెలుగు చీఫ్ బ్యూరో, ఫిబ్రవరి 12**
శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి 32వ అఖండ జ్యోతి రథయాత్ర ఈ నెల 15వ తేదీన బర్కత్ పుర లోని యాదాద్రి భవన్ నుంచి ప్రారంభమవుతుందని యాత్ర కమిటి చైర్మన్ సద్ది వెంకట్ రెడ్డి, గౌరవ సలహదారులు పడాల శ్రీకాంత్, అధ్యక్షుడు యం.చంద్రశేఖర్, సహాయ కార్యదర్శి బొమ్మల సుదీష్ కుమార్ తెలిపారు. గురువారం బర్కత్ పుర యాదాద్రి భవన్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో అఖండ జ్యోతి రథయాత్ర ప్రచార పోస్టర్ ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15వ తేదీన ఆదివారం బర్కత్ పుర లో రథయాత్ర ప్రారంభమై 18వ తేదీన యాదగిరి గుట్టకు చేరుకుని అఖండ జ్యోతిని ఆలయంలో అందించడం జరుగుతుందని తెలిపారు. 15న రథయాత్ర ప్రారంభమై బర్కత్ పుర, చిక్కడపల్లి, విద్యానగర్, అడిక్మెట్,







తార్నాక, హబ్సిగూడ, ఉప్పల్, 16న ఉప్పల్, ఫిర్జాదిగూడ, మేడిపల్లి, నారపల్లి, అన్నోజిగూడ, శివారెడ్డిగూడెం, ఘట్కేసర్, 17న ఘట్కేసర్, కొండమడుగు, బీబీనగర్, గూడూరు, పగిడిపల్లి, భువనగిరి, 18న భువనగిరి, రాయగిరి, వడాయిగూడెం మీదుగా యాదగిరి గుట్టకు రథయాత్ర చేరుకుంటుందన్నారు. రథయాత్ర ప్రారంభోత్సవ కార్యక్రమానికి కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు కొమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చామల కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కంభం అనిల్ కుమార్ రెడ్డి, అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఆలయ అనువంశిక ధర్మకర్త నర్సింహ్మా మూర్తి, ఆలయ ఈవో జె.భవాని శంకర్, నగరిగారి ప్రీతమ్ కుమార్ తదితర ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో యాదాద్రి భవన్ మేనేజర్ రామ కోటేష్, రథసారధి ఎ.గణపతి, ఎ. అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# మామునూరు ఎయిర్పోర్ట్ ను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాలి

» కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి కోరిన వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య



**భారతీయ వెలుగు చీఫ్ బ్యూరో, ఫిబ్రవరి 12**
తెలంగాణలో రెండో పెద్ద నగరమైన వరంగల్ కు సమీపంలో నిర్మించనున్న మామునూరు విమానాశ్రయాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాలని పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడుకి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మామునూరు విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియ పూర్తయినందున వెంటనే పనులు ప్రారంభించాలని కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో పార్లమెంట్‌లోని ఆయన ఛాంబర్‌లో సమావేశమయ్యారు. మామునూరు ఎయిర్‌పోర్ట్‌లో కార్గో సేవలతో పాటు మెయింటెనెన్స్, ఓవర్ హాల్ రిపేర్ (ఎం‌ఓఆర్) సదుపాయాలు ఉండేలా చూడాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. జౌళి, ఇతర పరిశ్రమలతో వరంగల్ నగరం పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చెందుతోందని, వరంగల్‌కు దగ్గరలో రెండేళ్లకోకసారి ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతర సమ్మక్క – సారలమ్మ జాతర మేడారంలో నిర్వహించడం వంటి ప్రాధాన్యతలను వివరించారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ పనుల ప్రారంభానికి తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులను అక్కడకు పంపిస్తానని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, రామసహాయం రఘురాంరెడ్డి, గడ్డం వంశీకృష్ణ గారితో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఫోటోలోని చిన్నారులను గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండి

**భారతీయ వెలుగు వరంగల్, ఫిబ్రవరి 12**
గత నెల జనవరి మాసంలో కాజీపేట పోలీస్ స్టేషన్ పరిధిలో,రైల్వే స్టేషన్ పరిసరాల్లో చిన్నారులను అపహరించి విక్రయాలకు పాల్పడుతున్న ముఠాను టాస్క్‌ఫోర్స్ మరియు కాజీపేట పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు.ఈ కేసులో నిందితుల నుంచి అపహరణకు గురైన పలువురు చిన్నారులను పోలీసులు రక్షించారు. రక్షించబడిన కొందరు చిన్నారులను వారి తల్లిదండ్రులను గుర్తించి ఇప్పటికే అప్పగించడం జరిగింది.అయితే,అపహరణకు గురై రక్షించబడిన ఫోటోలోని మరో ముగ్గురు చిన్నారులు ప్రస్తుతం శిశు సంక్షేమ శాఖ సంరక్షణలో ఉన్నారు.పోలీసుల విచారణలో వెల్లడైన వివరాలు:ఫోటోలోని చిన్నారుల్లో ఒకరైన 6 సంవత్సరాల వయస్సు గల బాబు 2023 అక్టోబర్ నెలలో కాజీపేట రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫామ్ నుంచి



అపహరించబడినట్లు నిందితులు వెల్లడించారు. మరో 7 నెలల పాప 2025 అక్టోబర్‌లో మంచిర్యాల రైల్వే స్టేషన్ పరిసరాల నుంచి అపహరించ బడినట్లు తెలిపారు.మరో 5 నెలల పాప రామగుండం రైల్వే స్టేషన్ పరిసరాల నుంచి అపహరించబడినట్లు విచారణలో తేలింది.గుర్తింపు కోసం పోలీసుల విజ్ఞప్తి ఈ ముగ్గురు చిన్నారులను ఎవరైనా గుర్తిస్తే వెంటనే కాజీపేట పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌ను సంప్రదించాలని పోలీసులు కోరారు.. ఇన్‌స్పెక్టర్ సుధాకర్ రెడ్డి **సెల్ నంబర్: 871268122**

# మున్సిపల్ ఎన్నికల్లో బీసీ అభ్యర్థుల దూకుడు




» జాతీయ బిసి మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్

**భారతీయ వెలుగు చీఫ్ బ్యూరో, ఫిబ్రవరి 12**
తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో బీసీ అభ్యర్థులు చూపిన ప్రదర్శన రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. రిజర్వేషన్ అమలులో రాజకీయ పార్టీల వైఖరిపై బీసీ సమాజం ఈ ఎన్నికల ద్వారా స్పష్టమైన సందేశం ఇచ్చిందని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ అన్నారు. గురువారం కాచిగూడ లో ఆయన మాట్లాడుతూ.. రిజర్వేషన్ వ్యవస్థలో బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించడంలో పార్టీలు విఫలమయ్యాయని విమర్శించారు. ఆ అసంతృప్తి ఈ ఎన్నికల్లో ఓట్ల రూపంలో వ్యక్తమైందని తెలిపారు.
ఈ ఎన్నికల్లో మొత్తం 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లు కలిపి 123 నగరపాలక సంస్థలలో 2,996 వార్డులకు పోలింగ్ జరిగింది. పార్టీలకు అతీతంగా అనేక మున్సిపాలిటీల్లో జనరల్ స్థానాల్లో పోటీ చేసిన బీసీలకు ప్రజలు విశేష మద్దతు తెలిపారని రాజేందర్ పటేల్ వెల్లడించారు. 'బీసీ ఓటు బీసీలకే' అనే భావజాలం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో బలంగా ప్రతిఫలించిందని చెప్పారు. ఇది కేవలం ఎన్నికల ఫలితం మాత్రమే కాదు, బీసీల సామాజిక ఆత్మగౌరవానికి సంకేతమని వ్యాఖ్యానించారు. బీసీల జనాభా ప్రాతిపదికన అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో కనీసం 50 శాతం ప్రాతినిధ్యం కల్పించేలా ప్రభుత్వం, రాజకీయ పార్టీలు స్పష్టమైన విధానం ప్రకటించాలని రాజేందర్ పటేల్ డిమాండ్ చేశారు.

# హరి ప్రసాద్ భౌతికకాయానికి నివాళు లర్పించిన సందెల విజయ్ కుమార్

**భారతీయ వెలుగు చీఫ్ బ్యూరో, ఫిబ్రవరి 12**
వరంగల్ పశ్చిమ నియోజకవర్గం కాజిపేట్ మండలం 47వ డివిజన్ డిజిల్ కాలనీ భవాని నగర్ కు చెందిన నదునూరి హరి ప్రసాద్ అనారోగ్యంతో మరణించారని తెలుసుకొని, గురువారం 47వ డివిజన్ కాంటెస్టెంట్ కార్పొరేటర్ సందెల విజయ్ కుమార్ వారి నివాసానికి చేరుకొని హరి ప్రసాద్ భౌతికకాయానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మతంగి విలియమ్స్, మాచర్ల శేఖర్, ప్రభాకర్, సుమన్, కాలనీ పెద్దలు ఎల్లయ్య, వెంకటయ్య, మల్లయ్య, సమ్మయ్య, వెంకటస్వామి, తదితరులు ఉన్నారు.



# వరంగల్ మండి బజార్‌లో జెడ్ ఏ క్రియేషన్స్ ఘన ప్రారంభం






**భారతీయ వెలుగు వరంగల్, ఫిబ్రవరి 12**
వరంగల్ నగరంలోని మండి బజార్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన జెడ్ ఏ క్రియేషన్స్ షాపును ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి,ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యతో పాటు వరంగల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు మహ్మద్ అయూబ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా బస్వరాజు సారయ్య మాట్లాడుతూ.. మండి బజార్‌లో అత్యాధునిక టెక్నాలజీతో ఏర్పాటు చేసిన జెడ్ ఏ క్రియేషన్స్ ద్వారా నూతన గృహప్రవేశాల నేమ్ బోర్డ్స్,కంపెనీ లోగోలు, ఆఫీస్ బోర్డ్స్,హాస్పిటల్ బోర్డ్స్ తయారీ చేయడం ఎంతో అభినందనీయమన్నారు.ఈ సంస్థ ఆధునిక సాంకేతికతతో సేవలు అందించడం నగరానికి మేలు చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో జెడ్ ఏ క్రియేషన్స్ ప్రొప్రైటర్ ఎజాజ్ అలీ,మండి బజార్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్ రహీం,వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ జాకీర్ అహ్మద్,సెక్రటరీ రాయబరపు రఘురాం తదితరులు పాల్గొన్నారు.

# పారామెడికల్ కాలేజీ విద్యార్థుల ఫీజు మదింపు

రాష్ట్రంలోని పారా మెడికల్ కళాశాలల్లో చదివే దాదాపు 30 వేల మంది విద్యార్థుల ఫీజు స్ట్రక్చర్ వివరాలను ఈ–పాస్ లో వెంటనే అప్లోడ్ చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమా శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని పారా మెడికల కళాశాలల్లో చదువుతున్న ఎస్.సి. ఎస్.టి, బీ.సి లకు చెందిన విద్యార్థులకు సంబందించిన ఫీజు స్ట్రక్చర్ ను 2024 –25 నుండి ఈ–పాస్ లో పెట్టనందున దాదాపు 30 వేల మంది విద్యార్థులు స్కాలర్షిప్స్ కోల్పోయే ప్రమాదం ఉందని పారా మెడికల అసోసియేషన్ అధ్యక్షులు ఎం. శ్రీనివాస్, రావు, కార్యదర్శి మోహన్ రెడ్డి లు నేడు మంత్రి లక్షణ్ కుమార్ కు విజ్ఞాపన పత్రాన్ని అందించారు. దీనిపై స్పందించిన మంత్రి ఈ విషయంలో వెంటనే తగు చర్యలు తీసుకోవాల్సిందిన సంబంధిత అధికారులను ఆదేశించారు.

భారతీయ వెలుగు
జాతీయ తెలుగు దిన పత్రిక
శుక్రవారం ఫిబ్రవరి 13, 2026

# సమన్వయంతో అధికారులు మహాశివరాత్రి జాతరను సక్సెస్ చేయాలి

» పకడ్బందీగా తుది ఏర్పాట్లు పూర్తి చేయాలి
» మహా శివరాత్రి జాతర కమిటీ చైర్ పర్సన్ గరిమ అగ్రవాల్
» వివిధ శాఖల అధికారులతో టెలి కాన్ఫరెన్స్



**భారతీయ వెలుగు ప్రతినిధి రాజన్న సిరిసిల్ల, వేములవాడ**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి సన్నిధితో పాటు శ్రీ భీమేశ్వరాలయంలో ఈనెల 14 నుండి 16 వరకు జరిగే మహా శివరాత్రి జాతరను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించి, విజయవంతం చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జి కలెక్టర్, మహా శివరాత్రి జాతర కమిటీ చైర్ పర్సన్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. గురువారం వివిధ శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుండి ఇంచార్జి కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. భీమేశ్వర ఆలయంలో మహా శివరాత్రి జాతర సందర్భంగా భక్తులు స్వామి వారి దర్శనాన్ని సౌకర్యంగా చేసుకునేలా తుది దశ ఏర్పాట్లు ముమ్మరంగా చేయాలని ఆదేశించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా బస్ లు సిద్ధం చేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. జడ్పీ డిప్యూటీ సీఈఓ, వేములవాడ మున్సిపల్ కమిషనర్, జిల్లా పంచాయతీ అధికారి సంయుక్తంగా ఆలయ పరిసరాలు, పార్కింగ్ స్థలాలు, క్యూ లైన్లు ఇతర చోట్ల మూడు షిఫ్టులో సిబ్బంది ఉండేలా చూడాలని ఆదేశించారు. జాతరకు ముందు నుండి తరువాత మూడు రోజుల వరకు పారిశుధ్య సేవలు అందించాలని సూచించారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆద్వర్యంలో బస్సు స్టాండ్, పార్కింగ్ స్థలాలు, ఇతర చోట్ల పూర్తి వివరాలతో హెల్ప్ డెస్క్ లు సిబ్బంది అందుబాటులో పెట్టాలని, ప్రతి చోట అన్ని వివరాలతో కూడిన సైన్ బోర్డులు పెట్టించాలని తెలిపారు. ఆలయంలోని క్యూల వద్ద, పార్కింగ్ స్థలాల వద్ద, బస్సు స్టాండ్లలో తాగు నీటి సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. సెస్ అధికారులు భీమేశ్వర ఆలయం, బద్ది పోచమ్మ ఆలయం, ఇతర చోట్ల 24 గంటల పాటు విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని, ప్రత్యామ్నాయంగా ఏర్పాట్లు కూడా చేసుకోవాలని, అధికారులు, సిబ్బంది ఉండాలని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖా ఆద్వర్యంలో భీమన్న ఆలయం, ప్రసాదం కౌంటర్, పార్కింగ్ స్థలాలు ఇతర చోట్ల వైద్యులు, సిబ్బంది, అంబులెన్స్ లతో సిద్దంగా ఉండాలని వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా, అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అగ్ని మాపక శాఖా అధికారులు ప్రధాన ఆలయాల్లో ఫైర్ సేఫ్టీ పరికరాలు చెక్ చేయాలని, వారి సిబ్బంది గుడి ఆవరణలో జాతర సమయంలో సిద్దంగా ఉండాలని సూచించారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు భక్తులకు అందించే ప్రసాదం, ఇతర ఆహార పదార్థాలను పరిశీలించాలని ఆదేశించారు. క్యూ లైన్లు, వీఐపీలు, కళ్యాణ కట్ట, ఇతర చోట్ల రద్దీ నియంత్రణ, దర్శనం పూర్తి చేసేందుకు జిల్లా స్థాయి అధికారులను నియమించామని, వారు ఆయా ఏర్పాట్లను పర్యవేక్షించాలని తెలిపారు. కోడెల నిర్వహణ, సంరక్షణ జిల్లా పశు సంవర్ధక శాఖ, ఆలయ అధికారులు సమన్వయంతో చూసుకోవాలని ఆదేశించారు. జాతర ఆవరణలో ప్లాస్టిక్ వస్తువులు వినియోగించకుండా చూడాలని సూచించారు. వృద్ధులు,దివ్యాంగులకు సహాయం కోసం వీల్ చైర్లు వాలంటీరను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జాతర విధులకు హాజరయ్యే అధికారులు, సిబ్బందికి కావాల్సిన గదులు, ఆహారం, ఇతర సదుపాయాలు వేములవాడ ఆర్డీఓ, ఆలయ అధికారులు చూసుకోవాలని సూచించారు. అన్ని శాఖల జిల్లా అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించాలని, జాతరకు వచ్చే భక్తులకు ఎక్కడా దర్శనం, వసతులలో ఇబ్బందులు రాకుండా చూడాలని స్పష్టం చేసారు. మీడియా సెంటర్ ఏర్పాటు చేయాలని, వీఐపీ, వీవీఐపీల దర్శనానికి అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. టెలీ కాన్ఫరెన్స్ లో ఎస్పీ మహేష్ బి గితే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, ఆలయ ఈఓ రమాదేవి తదితరులు ఉన్నారు.

# జాతర ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్





**భారతీయ వెలుగు ప్రతినిధి వేములవాడ**

వేములవాడ శ్రీ భీమేశ్వర స్వామి సన్నిధిలో జరిగే మహా శివరాత్రి జాతర ఏర్పాట్లను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ గురువారం పరిశీలించారు. పార్కింగ్ ఏరియా, క్యూలైన్లు, పారిశుధ్య పనుల ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. భక్తులకు సులభంగా దర్శనం అయ్యే విధంగా ఏర్పాట్లు ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో డీఆర్డీఓ గీత, ఆర్ అండ్ బీ ఈఈ నరసింహాచారి, డీఈ శాంతయ్య, ఆలయ ఈఈ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ర్యాలీలు,సభలు, సమావేశాలకు అనుమతి లేదు..

**- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**
**- కౌంటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన**




**భారతీయ వెలుగు ప్రతినిధి గోదావరిఖని ఫిబ్రవరి 12:**

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి జోన్‌లో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్, పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీలు, మంచిర్యాల జోన్‌లోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్, క్యాతన్‌పల్లి, బెల్లంపల్లి, చెన్నూర్, లక్షెట్టిపేట మున్సిపాలిటీలలో జరిగిన మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, పారదర్శకంగా ఫలితాలు ప్రకటించేందుకు కఠినమైన మూడంచెల భద్రతా ఏర్పాట్లు చేసినట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. ఈ సందర్భంగా గోదావరిఖని డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలను పోలీస్ కమిషనర్ సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఓట్ల లెక్కింపు భద్రతలో భాగంగా కౌంటింగ్ కేంద్రాల లోపలి భాగం, బయటి ప్రాంగణం, వెలుపలి ప్రధాన రహదారుల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రం చుట్టూ 100 మీటర్ల పరిధిలో మరియు వెలుపలి రహదారుల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి, అనధికార వాహనాలు మరియు వ్యక్తులకు అనుమతి లేకుండా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం 144 సెక్షన్ అమలులో ఉన్నందున ప్రజలు గుంపులుగా చేరకుండా ఉండాలని సూచించారు. ప్రజలు, రాజకీయ ప్రతినిధులు పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. రిటర్నింగ్ అధికారి జారీ చేసిన ఫోటో గుర్తింపు కార్డును భద్రతా సిబ్బందికి చూపించిన వారికే కౌంటింగ్ కేంద్రంలోకి ప్రవేశం ఉంటుందని తెలిపారు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, లైటర్లు వంటి నిషేధిత వస్తువులను కౌంటింగ్ హాల్లులోకి తీసుకెళ్లేందుకు అనుమతి లేదన్నారు. ర్యాలీలు, సభలు, సమావేశాలకు అనుమతి లేదని, బాణాసంచా, డీజేలను పూర్తిగా నిషేధించినట్లు స్పష్టం చేశారు. అధికారులు, పోలీసులు, ఏజెంట్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ ప్రక్రియ జరిగేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

# ఉగాది పురస్కారాలు 2026 దరఖాస్తుల ఆహ్వానం



**భారతీయ వెలుగు ప్రతినిధి గోదావరిఖని ఫిబ్రవరి 12:**

ఉగాది పర్వదినం పురస్కరించుకొని వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ,(వి.ఎస్.ఎస్.ఎస్) ఆధ్వర్యంలో అందించే ఉగాది పురస్కారాల కోసం ఉభయ తెలుగు రాష్ట్రాలలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు, సామాజిక సేవకులు, కవులు, కళాకారులు, పురహితులు, విద్య, వైద్య రంగం, సాహిత్యం, సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, శిల్పం, జానపదం, మిమిక్రి, ఇంద్రజాలం, హరికథ, బుర్రకథ, కోలాటం మొదలైన అంశాలతో పాటూ తదితర సేవా రంగాలకు కూడా వారికి ఈ పురస్కారాలు ఇవ్వడం జరుగుతుందని వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్ సురభి శ్రీధర్ తెలిపారు. ఆసక్తి గలవారు పురస్కారాలకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 8977748838 నంబర్ ను సంప్రదించాలని డాక్టర్ సురభి శ్రీధర్ తెలిపారు.

# ప్రజాస్వామ్య పట్ల అచంచల విశ్వాసం -- లండన్ నుంచి చిన్నారితో వచ్చి ఓటేసిన మాధురి





**భారతీయ వెలుగు ప్రతినిధి జమ్మికుంట పిబ్రవరి 12**

జమ్మికుంట మున్సిపల్ ఎన్నికలు ప్రజాస్వామ్య పండుగగా కొనసాగుతున్న వేళ, ఓటు హక్కు విలువను చాటి చెప్పే అరుదైన సంఘటన అందరి దృష్టిని ఆకర్షించింది. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లికి చెందిన కొక్కుల కేదారేశ్వర్--శ్రీలత దంపతుల కుమార్తె మాధురి, ప్రస్తుతం లండన్‌లో నివసిస్తున్నప్పటికీ, తన ఓటు హక్కు వినియోగించుకోవడం కోసం ప్రత్యేకంగా విదేశం నుంచి స్వగ్రామానికి చేరుకున్నారు. చిన్నారి కూతురిని వెంటబెట్టుకుని వేల కిలోమీటర్ల దూరం ప్రయాణించి పోలింగ్ కేంద్రానికి హాజరై ఓటు వేయడం ద్వారా ప్రజాస్వామ్యంపై తన అచంచల నమ్మకాన్ని చాటిచెప్పారు."ఓటు మన హక్కు మాత్రమే కాదు, మన భవిష్యత్తును నిర్ణయించే బాధ్యత కూడా" అని ఆమె పేర్కొన్నట్టు సమాచారం. విదేశాల్లో ఉన్నప్పటికీ స్వగ్రామ అభివృద్ధి పట్ల ఆసక్తి చూపిస్తూ ఓటు వేయడం యువతకు ఆదర్శంగా నిలుస్తుందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఎండీ. ఆయాజ్ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి మాధురిని ప్రత్యేకంగా అభినందించారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైనదని, ఇలాంటి చైతన్యం సమాజానికి స్ఫూర్తిదాయకమని ఆయన అన్నారు. మాధురిని సన్మానించి ఆమె కర్తవ్యనిబద్ధతను కొనియాడారు. ఆమె చిన్నారితో కలిసి ఓటు వేయడం చూస్తే ప్రజాస్వామ్య భావన తరతరాలకు ఎలా సంక్రమిస్తుందో స్పష్టమవుతుందని కమిషనర్ వ్యాఖ్యానించారు.

# మహా శివరాత్రికి పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు

**- జాతర విజయానికి అందరూ సమన్వయంతో పని చేయాలి**
**- ట్రాఫిక్ నియంత్రణ,పార్కింగ్ ప్రదేశాలపై ప్రత్యేక దృష్టి**
**- రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే**






**భారతీయ వెలుగు ప్రతినిధి రాజన్న సిరిసిల్ల, వేములవాడ**

వేములవాడ శ్రీ భీమేశ్వరాలయంలో జరిగే మహాశివరాత్రి జాతర సందర్భంగా పోలీస్ శాఖ తరపున పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు. గురువారం మహాశివరాత్రి జాతర భద్రతా ఏర్పాట్లపై జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో ఎస్పీ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భీమేశ్వర ఆలయంలో మహా శివరాత్రి జాతర సందర్భంగా స్వామి వారి దర్శనానికి వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చే భక్తులకు స్వామి వారి దర్శనం సులభంగా, ప్రశాంతంగా జరిగేలా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈనెల 14 నుండి 16 వరకు జరుగు మహా శివరాత్రి జాతరను విజయవంతం చేయడానికి గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ముందస్తు ప్రణాళికలతో చర్యలు తీసుకోవాలని సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భీమేశ్వర ఆలయంతో పాటు, బద్ది పోచమ్మ ఆలయం, నాంపెల్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, అగ్రహారం ఆలయల వద్ద భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండాలని సూచించారు. జాతరకు భారీగా తరలివచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నియంత్రణ,పార్కింగ్ ఏర్పాట్లు,క్యూలైన్ల నిర్వహణ, సీసీ కెమెరాల పర్యవేక్షణ, డ్రోన్ నిఘా వంటి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మహిళల భద్రత కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయడంతో పాటు, తప్పిపోయిన వారికోసం సహాయక కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. జాతర ప్రాంగణంలో అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులపై నిఘా పెంచాలని, ప్రజలకు సూచనలు చేస్తూ లౌడ్‌స్పీకర్ల ద్వారా అవగాహన కల్పించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అత్యవసర పరిస్థితుల కోసం ఫైర్, మెడికల్, రెవెన్యూ శాఖలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. జాతర బందోబస్తు విధుల నిమిత్తం ఇతర ప్రాంతాల నుండి వచ్చే పోలీస్ అధికారులు,సిబ్బందికి తగిన వసతి సౌకర్యాలు కల్పించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. విధులు నిర్వర్తించే సిబ్బందికి విశ్రాంతి తీసుకునేందుకు అనుకూలమైన వసతి గృహాలు, తాగునీరు, పారిశుధ్య సౌకర్యాలు,భోజన ఏర్పాట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతర సమయంలో పోలీస్ అధికారులు,సిబ్బంది సమన్వయంతో పనిచేసి భక్తులకు సురక్షిత, సౌకర్యవంతమైన వాతావరణంలో దర్శనం కల్పించడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ సమావేశంలో వేములవాడ ఏఎస్పీ రుత్విక్ సాయి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ నాగేంద్రచారి, ఇన్స్పెక్టర్ లు వీరప్రసాద్, కృష్ణ,మొగిలి, శ్రీనివాస్, శ్రీనివాస్,వెంకటేశ్వర్లు, మధుకర్, రవి, నాగేశ్వరరావు, ఆర్ఐ లు మధుకర్, యాదగిరి, రమేష్, ఎస్ఐలు,ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

# భీమేశ్వర స్వామిని దర్శించుకున్న విశ్రాంత ఉద్యోగులు



**భారతీయ వెలుగు ప్రతినిధి వేములవాడ**

వేములవాడ శ్రీ భీమేశ్వర స్వామి వారిని భువనగిరి జిల్లా బీబీనగర్ మండలానికి చెందిన సుమారు 30 మంది విశ్రాంత ఉద్యోగులు గురువారం సతీ సమేతంగా దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా వారు కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామిని, ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఎన్. ఆంజనేయులు, కార్యదర్శి టి. సత్తిరెడ్డి విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

## 15న సంత్ సేవాలాల్ జయంతి

# బంజారా భవన్‌లో కార్యక్రమాలు

ఈ నెల 15 వ తేదీ ఉదయం 11.00 గంటలకు హైదరాబాద్లో ఉన్న బంజారాహిల్స్ లోని సేవాలాల్ బంజారా భవన్లో లంబాడీ గిరిజనుల సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి ఘనంగాజరుగనుంది. ఈ జయంతి ఉత్సవాలలో రాష్ట్ర ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, పార్లమెంటు సభ్యులు, రాష్ట్రానికి చెందిన అందరు గిరిజన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక కార్పొరేటర్ తదితర ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని గిరిజన సంక్షేమ శాఖామాత్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా లంబాడీ గిరిజన సాంప్రదాయ పద్ధతి ప్రకారం సంత్ సేవాలాల్ ఆరాధన కార్యక్రమాలు, గిరిజన సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.ఈ సందర్భాన్ని పురస్కరించుకుని గౌరవ మంత్రివర్యులు మాట్లాడుతూ 2024 నాటి సేవాలాల్ జయంతి కార్యక్రమంలో పాల్గొని గౌ. ముఖ్యమంత్రి శ్రీ అనుముల రేవంత్ రెడ్డి గారు అప్పటి వరకు వేడుకలకు ఖర్చు పెడుతున్న రూ. కోటిని రూ. రెండు కోట్లుగా రెట్టింపు చేయడమే కాకుండా బంజారా ఉద్యోగులకు ఉత్సవాలు జరుపుకోవడానికి వీలుగా ఫిబ్రవరి 15 నాడు స్పెషల్ లీవ్ శాంక్షన్ చేశారని గుర్తు చేశారు. ఈ నెల 15 నుంచి 21 వరకు అన్ని జిల్లాలలోని అన్ని ఎమ్మెల్యే నియోజకవర్గాలలో జరుగనున్న సేవాలాల్ జయంతి ఉత్సవాల నిర్వహణకై రాష్ట్ర ప్రభుత్వం రూ. రెండు కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన ప్రజలు, ప్రజా ప్రతినిధులు, మీడియా మిత్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరుతూ అందరికీ ఆహ్వానం పలికారు.

భారతీయ వెలుగు

శుక్రవారం ఫిబ్రవరి 13, 2026

## విషాదంలోనూ విధి నిర్వర్తన -- తల్లి మృతితో ఉన్న కుటుంబం ఓటేసి ఆదర్శంగా నిల్చారు

**భారతీయ వెలుగు ప్రతినిధి జమ్మికుంట ఫిబ్రవరి 12....**





జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లికి చెందిన రజిబి (80) మృతి చెందడంతో విషాదంలో ఉన్న కుటుంబ సభ్యులు కూడా తమ ప్రజాస్వామ్య బాధ్యతను విస్మరించలేదు. తల్లి అంత్యక్రియలు ఇంకా పూర్తికాకముందే పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఓటు హక్కు వినియోగించిన మృతురాలి కుమారుడు ఇస్మాయిల్, కోడలు షబానా, మనవరాలు సన ప్రజాస్వామ్య పట్ల తమ కట్టుబాటును చాటిచెప్పారు.

విషాదాన్ని మనసులో ఉంచుకుని కూడా ప్రజాస్వామ్య పండుగలో పాల్గొనడం వారి బాధ్యతాభావానికి నిదర్శనంగా నిలిచింది. ఈ విషయాన్ని తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ ఎండీ. ఆయాజ్ కుటుంబ సభ్యులను ప్రత్యేకంగా కలుసుకుని అభినందించారు. తల్లి మృతితో కలిగిన బాధను పంచుకుంటూ వారికి సానుభూతి తెలిపారు.

“ప్రజాస్వామ్యం బలపడాలంటే ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరం. కష్టసుఖాల మధ్యలోనూ ఓటు హక్కును వినియోగించడం గొప్ప విషయం” అని కమిషనర్ పేర్కొన్నారు. వారి త్యాగస్ఫూర్తి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

జమ్మికుంట మున్సిపల్ ఎన్నికల్లో చోటుచేసుకున్న ఈ రెండు సంఘటనలు ప్రజాస్వామ్యానికి ఉన్న గొప్పతనాన్ని మరోసారి చాటిచెప్పాయి. విదేశాల నుంచి వచ్చి ఓటేసిన యువతి, విషాదంలోనూ విధి నిర్వర్తించిన కుటుంబం --- ఈ ఇద్దరూ సమాజానికి ఒక స్పష్టమైన సందేశం ఇచ్చారు:

ఓటు అంటే కేవలం ఒక గుర్తు కాదు… అది మన హక్కు, మన బాధ్యత, మన భవిష్యత్తు.

## క్రీడలతో శారీరక దృఢత్వం.. మానసిక ఉల్లాసం



**- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**భారతీయ వెలుగు ప్రతినిధి వేములవాడ**

క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ అన్నారు. గురువారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 16 నుండి 19 వరకు జూనియర్ కాలేజీ మైదానంలో జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రస్థాయి మెన్, ఉమెన్ వాలీబాల్ క్రీడలను విజయవంతం చేయాలని ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో క్రీడలకు పెద్ద పీట వేస్తున్నట్లు తెలిపారు.. సీఎం కప్ పేరిట క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు చేన్నమనేని శ్రీ కుమార్, ఉపాధ్యక్షులు కోళ్ల శ్రీనివాస్ , ప్రధాన కార్యదర్శి అజ్మీర రాందాస్, ఈసీ నెంబర్ మైలారం తిరుపతి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సంద్రగిరి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు..

## జర్నలిస్టు అక్రెడిటేషన్ కార్డులు 44,706

**- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్.**



**భారతీయ వెలుగు ప్రతినిధి హైదరాబాద్**

రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకూ అక్రెడిటేషన్ కార్డు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం పట్ల సీఎం రేవంత్రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో పనిచేస్తోందన్నారు. అక్రెడిటేషన్ కార్డుల జారీ విధానం, కమిటీ ఏర్పాటు. తదితర అంశాలపై ఇవాళ సచివాలయంలోని తన కార్యాలయంలో ఐఅండ్ పీఆర్ కమిషనర్ సిహెచ్. ప్రియాంక, సీపీఆర్వో మల్సూర్తో మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా సాగేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. అక్రెడిటేషన్ కార్డుల జారీకి సంబంధించి ప్రభుత్వం ముందుగా జీవో 252 జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. అనంతరం జర్నలిస్టు సంఘాలతో సమావే శమై వారి సూచనలు, అభిప్రాయాలను సవివరంగా పరిగణనలోకి సవరణలు చేసి జీవో 103ను జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ సవరణల ద్వారా రాష్ట్రవ్యా ప్తంగా ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, డిజిటల్ మీడియా విభాగాల్లో మొత్తం 44,706 అక్రెడిటేషన్ కారులు పొందే అవకాశం కలుగుతుందని తెలిపారు. గతంలో సుమారు 23 వేల మందికి మాత్రమే అక్రెడిటే షన్ కార్డులు ఉండగా, తాజా నిర్ణయంతో దాదాపు 21 వేలకు పైగా కార్డుల సంఖ్య పెరుగుతుందని మంత్రి వివరించారు. అక్రెడిటేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని, అవసరాన్ని బట్టి మరోసారి సమావేశమై తదుపరి చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రజాస్వామ్యంలో నాలుగో సంభంగా ఉన్న మీడియా ప్రతినిధుల గౌరవం, భద్రత, సంక్షేమం ప్రభు త్వానికి అత్యంత ప్రాధాన్యమని స్పష్టం చేశారు.

# లేబర్ కోడ్స్ కార్మికుల మెడకు ఉరితాళ్లు వెంటనే నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

**భారతీయ వెలుగు ప్రతినిధి ఇల్లందకుంట పిబ్రవరి 12**

దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఇల్లందకుంట మండల కేంద్రంలో సిఐటియు, తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ, ధర్నా కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని ప్రయత్నిస్తున్న నాలుగు లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, భవన నిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆందోళన వ్యక్తం చేశారు. చేతుల్లో ఎర్ర జెండాలతో, నినాదాలతో మండల కేంద్రం మార్మోగిపోయింది.

మండలంలోని వివిధ గ్రామాల నుంచి కార్మికులు, రైతులు ట్రాక్టర్లు, బైకులతో చేరుకొని ర్యాలీలో పాల్గొన్నారు. “కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ రద్దు చేయాలి”, “కార్మిక హక్కులపై దాడి ఆపాలి”, “పెట్టుబడిదారులకు కాదు, కార్మికులకు న్యాయం చేయాలి” అంటూ నినాదాలు చేశారు. అనంతరం మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చెల్పూరి రాము మాట్లాడుతూ, ప్రస్తుతం అమలులోకి తీసుకురావాలని చూస్తున్న నాలుగు లేబర్ కోడ్స్---వేతన కోడ్, పరిశ్రమల సంబంధాల కోడ్, సామాజిక భద్రత కోడ్, వృత్తి భద్రత మరియు ఆరోగ్య కోడ్---మొత్తం 44 కార్మిక చట్టాలను ఒకే చట్రంలోకి తీసుకువచ్చి కార్మికుల హక్కులను కుదించే ప్రయత్నమని విమర్శించారు. కార్మికోద్యమం బలహీనపడేలా యూనియన్ హక్కులపై ఆంక్షలు విధించడం ఈ కోడ్స్ లక్ష్యమని అన్నారు.



1926 ట్రేడ్ యూనియన్ చట్టంలో ఉన్న అనేక హక్కులను ఈ కోడ్స్ ద్వారా పరిమితం చేస్తున్నారని, ముఖ్యంగా యూనియన్ల రిజిస్ట్రేషన్ విషయంలో కఠిన నిబంధనలు పెట్టి కార్మికుల సంఘటిత పోరాటాన్ని అడ్డుకునే ప్రయత్నం జరుగుతోందని పేర్కొన్నారు. సెక్షన్ 6(2), 6(4) వంటి నిబంధనల ద్వారా యూనియన్ నమోదు ప్రక్రియను క్లిష్టతరం చేసి, పెద్ద ఎత్తున కార్మికులను సంఘటితం కాకుండా నిరోధించే విధానం అనుసరిస్తున్నారని విమర్శించారు.

అలాగే పరిశ్రమల సంబంధాల కోడ్ ప్రకారం 300 మంది వరకు కార్మికులు పనిచేసే సంస్థల్లో యాజమాన్యం ముందస్తు ప్రభుత్వ అనుమతి లేకుండానే ఉద్యోగాల తొలగింపులు, లేఆఫ్‌లు చేయగలగడం కార్మికులకు తీవ్ర అన్యాయం అని అన్నారు. ఇది ఉద్యోగ భద్రతను పూర్తిగా దెబ్బతీస్తుందని, నిరుద్యోగం మరింత పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

పనిగంటలను పెంచడం, ఓవర్‌టైమ్ నియమాలను మార్చడం, కాంట్రాక్ట్ వ్యవస్థను ప్రోత్సహించడం వంటి అంశాలు కార్మికులను అస్థిర పరిస్థితుల్లోకి నెట్టేస్తాయని పేర్కొన్నారు. సామాజిక భద్రత కోడ్‌లోనూ అసంఘటిత రంగ కార్మికులకు స్పష్టమైన హామీలు లేకపోవడం వల్ల వారికి ప్రయోజనం కలగదని అభిప్రాయపడ్డారు.

భవన నిర్మాణ కార్మికులు, వ్యవసాయ కార్మికులు, చిన్న పరిశ్రమలలో పనిచేసే కార్మికులు ఈ చట్టాల వల్ల మరింత దెబ్బతింటారని, కనీస వేతనం, పింఛన్, బీమా, వైద్య సదుపాయాల వంటి అంశాలు ప్రశ్నార్థకంగా మారతాయని అన్నారు. కార్మిక వర్గాన్ని పెట్టుబడిదారుల ప్రయోజనాలకు అనుకూలంగా మార్చే ప్రయత్నమే ఈ కోడ్స్ ఉద్దేశమని విమర్శించారు.

కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ నాలుగు లేబర్ కోడ్స్‌ను పూర్తిగా రద్దు చేసి, కార్మిక సంఘాలతో సంప్రదింపులు జరిపి ప్రజాస్వామ్య పద్ధతిలో చట్టాలు రూపొందించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేర్చే వరకు పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ నిరసన కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు రేణిగుంట్ల సారయ్య, రైతు సంఘం మండల కార్యదర్శి శ్రీకాంత్, సంతోష్, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కన్వీనర్ జముఖం వెంకన్న, కో-కన్వీనర్ రావుల ఎల్లయ్య, గ్రామపంచాయతీ యూనియన్ గాదసిరి సంపత్, తోడం శ్రీనివాస్, సారయ్య, చంద్రయ్య, సత్తి, మధుకర్, రమేష్, సమ్మయ్య, రాజయ్య, వీరస్వామి, సాంబయ్య, శ్రీనివాస్, ఆనందం, కుమార్, శ్యామ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు, రైతులు ఐక్యంగా పోరాడితేనే హక్కులు కాపాడుకోవచ్చని నేతలు స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న సమ్మెలకు ఐక్యత తెలుపుతూ భవిష్యత్తులో మరింత విస్తృత ఆందోళనలకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు.

## నర్సాపూర్ నియోజకవర్గంలోని పలు గ్రామాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి

**భారతీయ వెలుగు వెల్దుర్తి మాసాయిపేట ప్రతినిధి ఫిబ్రవరి 12**

మెదక్ జిల్లానర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామం:కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దపులి సతీష్ కుమారుడి బారసాల కార్యక్రమానికి హాజరై శిశువుకు ఆశీర్వాదాలు అందించారు. కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలుపుతూ



ఆనందంలోభాగస్వాములయ్యారు, అలాగే సతీష్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. హత్నూర మండలం బొరపట్ల గ్రామకాంగ్రెస్ పార్టీ సీనియర్



నాయకులు మామిడిగారి మల్లా రెడ్డి దశదినకర్మ కార్యక్రమానికి హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి



దుఃఖంలోభాగస్వాములయ్యారు. మల్లా రెడ్డి సేవలు పార్టీకి, గ్రామ అభివృద్ధికి ఎప్పటికీ స్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ కే రామగుండం మేయర్ పీఠం

**- రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్**

**భారతీయ వెలుగు ప్రతినిధి, జ్యోతి నగర్(రామగుండం), ఫిబ్రవరి 12:**

రామగుండం మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలందరూ బీఆర్ఎస్ పార్టీ కేసీఆర్ కి మద్దతుగా నిలిచారని మెజార్టీ స్థానాలను బీఆర్ఎస్ పార్టీ సాధించి మూడవ సారి రామగుండం మేయర్ పీఠంపై గులాబీ జెండా ఎగరవేస్తామని రామగుండం మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కోరుకంటి చందర్ అన్నారు. గురువారం ఎన్టీపీసీ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రామగుండంలో గుండా పాలన పోలీస్ పాలన సాగుతుందని, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు



ప్రజలు స్వచ్ఛందంగా ఓటు వేశారన్నారు. రామగుండం నియోజకవర్గంలో గత రెండు సంవత్సరాల జరుగుతున్న కాంగ్రెస్ దుర్మార్గపు అరాచక పాలనకు ప్రజలు చరమ గీతం పాడుతారన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. బెదిరింపులతో ఎన్ని ఇబ్బందులు పెట్టినా నామినేషన్లు విత్ డ్రా చేయించిన రామగుండం కార్పొరేషన్ బీ.ఆర్.ఎస్. పార్టీ అభ్యర్థులు మెక్కవోని ధైర్యంతో ఎన్నికల్లో కొట్లాడారన్నారు. ప్రజలందరూ బీఆర్ఎస్ పార్టీ పక్షాన నిలిచారన్నారు. తొలి సీఎం కేసీఆర్ పరిపాలనలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకం అందించడం జరిగిందన్నారు. సంక్షేమ సారధి కెసిఆర్ పాలన ప్రజలందరూ కోరుతున్నారన్నారు. రాబోవు కాలంలో తిరిగి కెసిఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని చెప్పారు. రామగుండం కార్పోరేషన్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసిన ప్రజలందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ విలేఖరుల సమావేశంలో నాయకులు మూల విజయ రెడ్డి, మిర్యాల రాజి రెడ్డి, గోపు అయులయ్య యాదవ్, నడిపల్లి అభిషేక్ రావు తోపాటు బీ.ఆర్.ఎస్. పార్టీ అభ్యర్థులు పాల్గొన్నారు.


# మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ నియమ నిబంధనలు

**- నర్సాపూర్ ఎస్సై రంజిత్ రెడ్డి**

**భారతీయ వెలుగు వెల్దుర్తి మాసాయిపేట ప్రతినిధి ఫిబ్రవరి 12**

మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కార్యక్రమం నేడు బి.వి.ఆర్.ఐ.టి కళాశాల నిర్వహించబడును. ఈ సందర్భంగా ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లు, కౌంటింగ్ ఏజెంట్లు మరియు నర్సాపూర్ పట్టణ ప్రజలకు క్రింది సూచనలు తెలియజేయడమైనది:పార్కింగ్ సంబంధించి:కౌంటింగ్ కేంద్రానికి వచ్చే వారందరూ తమ వాహనాలను వైపర్ కాలేజ్ దగ్గర ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశంలో మాత్రమే పార్క్ చేయాలి. రోడ్డుకు ఇరువైపులా వాహనాలు పార్క్ చేసినట్లయితే, అట్టి వాహనాలపై కేసులు నమోదు చేయబడును. ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించే విధంగా ఎటువంటి వాహనాలు నిలిపివేయరాదు. 200 మీటర్ల నిషేధిత పరిధి:కౌంటింగ్ సెంటర్‌కు 200 మీటర్ల పరిధిలోకి కేవలం అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లు మరియు కౌంటింగ్ ఏజెంట్లకు మాత్రమే ప్రవేశం ఉంటుంది. ఇతర వ్యక్తులకు ప్రవేశం ఉండదు. 200 మీటర్ల పరిధిలోకి ఎటువంటి సెల్ ఫోన్లు




అనుమతించబడవు. సంబంధిత వ్యక్తులు తమ సెల్ ఫోన్లను ఇంటి వద్ద లేదా 200 మీటర్ల బయట విశ్వసనీయ వ్యక్తుల వద్ద ఉంచి లోపలికి రావాలి. ఎన్నికల కోడ్ అమలు:మున్సిపల్ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నది. కౌంటింగ్ అనంతరం గెలిచిన అభ్యర్థులు ఎటువంటి ర్యాలీలు, రోడ్డు షోలు, బాణాసంచా కాల్చడం, డీజేలు ఏర్పాటు చేయడం, గుంపులు గుమికూడడం వంటి కార్యక్రమాలు నిర్వహించరాదు. మైక్‌లు, లౌడ్ స్పీకర్లు, వాహన ర్యాలీలకు అనుమతి లేదు. చట్టం మరియు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలు తీసుకున్న వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోబడును. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం, ప్రేరేపించే పోస్టులు, గెలుపు-ఓటమి పై ద్వేషపూరిత వ్యాఖ్యలు చేయరాదు. ఉల్లంఘించినట్లయితే చట్టరీత్యా కేసులు నమోదు చేయబడును. గుంపులుగా చేరడం, నినాదాలు చేయడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం నిషేధం. అందరూ పోలీసు శాఖకు సహకరించి కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంతంగా మరియు సజావుగా నిర్వహించేందుకు సహాయపడగలరని నర్సాపూర్ఎస్సై రంజిత్ రెడ్డి తెలియజేశారు

# నేటి మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కు పకడ్బందీ ఏర్పాట్లు

- ఉదయం 08.00 గంటలకు కౌంటింగ్ ప్రారంభం
- ముందుగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు
- ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్
- సిరిసిల్ల, వేములవాడ సినారె కళామందిరంలో కౌంటింగ్ ఏర్పాట్ల పరిశీలన



**భారతీయ వెలుగు ప్రతినిధి రాజన్న సిరిసిల్ల, వేములవాడ**
సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేశామని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ తెలిపారు. సిరిసిల్ల సినారె కళామందిరంలో మాక్ కౌంటింగ్ ప్రక్రియ శుక్రవారం చేయగా, ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జిల్లా మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి తో కలిసి పరిశీలించారు. వేములవాడ సినారె కళామందిరంలో మాక్ కౌంటింగ్ ప్రక్రియను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పరిధిలో సినారె కళామందిరాల్లో కౌంటింగ్ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని వెల్లడించారు. బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూంలలో భద్రపరిచామని, ఇప్పటికే ఎస్పీ మహేష్ బి గితే తో కలిసి ఏర్పాట్లు పరిశీలించామని వివరించారు. శుక్రవారం ఉదయం 08.00 గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం అవుతుందని తెలిపారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కిస్తారని వివరించారు. ఒక్కో వార్డుకు ఒక టేబుల్ చొప్పున ఏర్పాటు చేశామని తెలిపారు. ఒక్కో టేబుల్ వద్ద కౌంటింగ్ సూపర్వైజర్, ఇద్దరు అసిస్టెంట్లు, మూడు టేబుల్ లకు కలిపి ఒక ఆర్ఓ, ఏఆర్ఓ ఉంటారని వెల్లడించారు. సిరిసిల్లలో మొత్తం 39 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 78 మంది కౌంటింగ్ అసిస్టెంట్లను నియమించామని తెలిపారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు మొత్తం ప్రక్రియ పూర్తి చేస్తామని వివరించారు. వేములవాడ లో మొత్తం 28 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 56 మంది కౌంటింగ్ అసిస్టెంట్లను నియమించామని తెలిపారు. అధికారులు, సిబ్బందికి ఇప్పటికే శిక్షణ పూర్తి చేశామని తెలిపారు. ఈ ప్రక్రియ పర్యవేక్షణకు గెజిటెడ్ అధికారులను నియమించామని పేర్కొన్నారు. ఈ పరిశీలనలో ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, సంపత్ కుమార్, ఎన్నికల విభాగం అధికారులు శ్రీనివాసాచారి, మీర్జా ఫసహత్ అలీ బేగ్, అన్సర్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ వైకారికి నిరసనగా వామపక్షాలు ఇచ్చిన బందు పిలుపు మేరకు వెల్దుర్తి మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించిన

- సిపిఎం కార్మికులు కార్యకర్తలు నాయకులు



**భారతీయ వెలుగు వెల్దుర్తి మాసాయిపేట ప్రతినిధి ఫిబ్రవరి 12**
మెదక్ జిల్లా వెల్దుర్తి మండల కేంద్రంలో సిపిఎం నాయకులు బంద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా వామపక్షాలు ఇచ్చిన బందు పిలుపుమేరకు నిరసన కార్యక్రమం చేపట్టారు. మండల కేంద్రంలో కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించి వ్యాపార సంస్థలను మూసి వేయించారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులను మోసం చేసిందని, ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఆందోళన చేపట్టారు. కార్మికులందరికీ కనీస వేతనం అమలు చేయాలని, ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హమాలీ సంఘం మండల అధ్యక్షులు వెంకట్, సాయిలు, లక్ష్మణ్ మున్సిపాలిటీ కార్మిక సంఘం నుంచి పెంటయ్య యాదయ్య సుధాకర్ ఏసు పోచమ్మ బాలమణి నందు లక్ష్మి శోభ బాల పోచయ్య నర్సింలు బాలయ్య ఎల్లం బాలయ్య నర్సింలు మానేపల్లి జిపి మధు యాదగిరి స్వామి సత్యనారాయణ ఎంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

# జమ్మికుంట మున్సిపల్ 2వ సాధారణ ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లు సిద్ధం

- మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఆయాజ్ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు



**భారతీయ వెలుగు ప్రతినిధి జమ్మికుంట ఫిబ్రవరి 12.....**
జమ్మికుంట మున్సిపాలిటీకి జరిగిన 2వ సాధారణ ఎన్నికల కౌంటింగ్ కార్యక్రమం తేదీ: 13-02-2026 రోజున నిర్వహించబడనుంది. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఆయాజ్ ఆధ్వర్యంలో అన్ని విభాగాలతో సమన్వయం చేస్తూ కౌంటింగ్ ప్రక్రియను పారదర్శకంగా, సజావుగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు పూర్తయ్యాయి.ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైన దశ అయిన కౌంటింగ్ కార్యక్రమం పారదర్శకత, క్రమబద్ధత, భద్రతా ప్రమాణాలతో నిర్వహించేందుకు అధికారులు అన్ని చర్యలు చేపట్టారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఏర్పాట్లు చేపట్టి, రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు, ఏజెంట్లు సమక్షంలో ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు.
కౌంటింగ్ ఏర్పాట్ల వివరాలు:
కౌంటింగ్ కేంద్రం: ప్రభుత్వ డిగ్రీ ఓ పీజీ కళాశాల, జమ్మికుంట
మొత్తం కౌంటింగ్ హాళ్లు: 5
మొత్తం కౌంటింగ్ టేబుల్స్: 30
మొత్తం కౌంటింగ్ రౌండ్లు: 1
మొత్తం కౌంటింగ్ సూపర్వైజర్లు: 30
మొత్తం కౌంటింగ్ అసిస్టెంట్లు: 60
ప్రతి హాల్‌లో సముచితమైన టేబుల్స్ ఏర్పాటు చేసి, ఒక్కో టేబుల్‌కు ఒక సూపర్వైజర్ మరియు ఇద్దరు అసిస్టెంట్లను నియమించారు. కౌంటింగ్ సిబ్బందికి ముందస్తు శిక్షణ కూడా అందించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఎటువంటి అవాంతరాలు కలగకుండా సీసీ కెమెరాల పర్యవేక్షణ, భద్రతా సిబ్బంది నియామకం వంటి చర్యలు చేపట్టారు.
కౌంటింగ్ కేంద్రం పరిసర ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణ కోసం తగిన పోలీసు బలగాలను మోహరించారు. అనధికార వ్యక్తుల ప్రవేశం లేకుండా కట్టుదిట్టమైన నియంత్రణలు అమలు చేయనున్నారు. అభ్యర్థులు, ఏజెంట్లకు ప్రత్యేక పాస్‌లు జారీ చేయబడినట్లు అధికారులు తెలిపారు.
ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఆయాజ్ మాట్లాడుతూ,
"ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, నియమావళి ప్రకారం నిర్వహించబడుతుంది. ప్రతి ఓటు విలువైనదే. ప్రజలు నమ్మకంతో వేసిన ఓట్లను నిష్పక్షపాతంగా లెక్కించి ఫలితాలను ప్రకటిస్తాం" అని తెలిపారు.
జమ్మికుంట మున్సిపల్ ఎన్నికల ఫలితాల కోసం పట్టణ ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా పూర్తవుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# కష్టపడి చదివి తమ లక్ష్యాలను సాధించాలి



- పదవ తరగతి విద్యార్థులకు రోల్ మెడల్ ప్రేరణ తరగతులను నిర్వహించిన
- నాల చెరువు రమేష్ గౌడ్

**భారతీయ వెలుగు వెల్దుర్తి మాసాయిపేట ప్రతినిధి ఫిబ్రవరి 12**
మెదక్ జిల్లా వెల్దుర్తి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం నాడుపదవ తరగతి విద్యార్థులకు నాలాచెరువు రమేష్ గౌడ్ రోల్ మోడల్ ప్రేరణ తరగతులు చెప్పించడం జరిగింది. పదవ తరగతి విద్యార్థులకు నాలాచెరువు రమేష్ యెల్దుర్తి ఒక మంచి రోల్ మోడల్.
ఆయన కష్టపడి చదివి, పట్టుదలతో జీవితంలో ఎదిగిన వ్యక్తి. విద్యకు ఇచ్చే ప్రాధాన్యత, క్రమశిక్షణ, మంచి విలువలు ఆయనను ప్రత్యేకంగా నిలబెడతాయి. ఎలాంటి కష్టాలు వచ్చినా వెనుకడుగు వేయకుండా ముందుకు సాగిన తత్వం విద్యార్థులకు ఆదర్శం. అందుకే పదవ తరగతి విద్యార్థులు ఆయనను రోల్ మోడల్‌గా తీసుకుని, కష్టపడి చదివి తమ లక్ష్యాలను సాధించాలి అని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. సాంబయ్య తెలియజేశారు. నాలా చెరువు రమేష్ గౌడ్ మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు దగ్గర పడుతున్నందున ఒత్తిడికి లోను కాకుండా, భయాందోళనలకు గురి కాకుండా పరీక్షలు రాయాలని తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నరసింహారెడ్డి, చార్లెస్, అమూల్య, జయసుధ, పద్మజ, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# జమ్మికుంటలో కుటుంబ కలహాలు హింసకు దారితీశాయి

- అల్లుడిపై మామ, బావమరిది కర్రలతో దాడి
- తలపై తీవ్ర గాయం... 8 కుట్లు... పోలీసులు కేసు నమోదు....



**భారతీయ వెలుగు ప్రతినిధి జమ్మికుంట ఫిబ్రవరి 12...**
కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణ పరిధిలో కుటుంబ వివాదం ఉద్రిక్తతకు దారితీసి దాడి ఘటనగా మారింది. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. పట్టణ సీఐ రామకృష్ణ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మోతుకులగూడెం గ్రామానికి చెందిన బండ రాకేష్ (తండ్రి: రమేష్) తేదీ 12-02-2026న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తనకు సుమారు ఆరు సంవత్సరాల క్రితం కొత్తపల్లి గ్రామానికి చెందిన ప్రశాంతి అనే యువతితో ప్రేమ వివాహం జరిగిందని, వారికి ఇద్దరు కుమారులు ఉన్నారని తెలిపాడు.
తేదీ 11-02-2026న ఇంటి వద్ద భార్యాభర్తల మధ్య మాటామాటా పెరిగి గొడవ జరిగినట్లు పేర్కొన్నాడు. ఆ తరువాత తన భార్య ప్రశాంతి తన తల్లి ఇంటికి వెళ్లిపోయిందని తెలిపాడు. అదే రోజు రాత్రి సుమారు 8 గంటల సమయంలో తన మామ మంద రాజు ఫోన్ చేసి రామన్నపల్లి రోడ్డువద్ద ఉన్నానని, మాట్లాడుకుందామని పిలిచినట్లు ఫిర్యాదులో వివరించాడు.
అక్కడికి వెళ్లిన రాకేష్‌తో మాట్లాడుతున్న క్రమంలో వాగ్వాదం ముదిరి ఘర్షణకు దారితీసిందని, ఈ సమయంలో తన మామ మంద రాజు మరియు బావమరిది మండ ప్రశాంత్ కలిసి కర్రలతో దాడి చేశారని ఆరోపించాడు. దాడిలో తల వెనుక భాగంలో తీవ్ర గాయం కావడంతో 8 కుట్లు వేయాల్సి వచ్చిందని, వీపు మరియు చేతులపై కూడా గాయాలైనట్లు తెలిపాడు. గాయపడిన రాకేష్‌కు స్థానిక ఆసుపత్రిలో చికిత్స అందించినట్లు సమాచారం.
ఫిర్యాదు ఆధారంగా సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, నిందితులపై చట్టపరమైన చర్యలు చేపడుతున్నామని సీఐ రామకృష్ణ గౌడ్ తెలిపారు. కుటుంబ వివాదాలు హింసాత్మక ఘటనలకు దారితీయకుండా పరస్పర చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని పోలీసులు సూచించారు.
ఈ ఘటనపై పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# జమ్మికుంటలో మహిళ అదృశ్యం

- మిస్సింగ్ కేసు నమోదు, గాలింపు చర్యలు ప్రారంభించిన పోలీసులు



**భారతీయ వెలుగు ప్రతినిధి జమ్మికుంట ఫిబ్రవరి 12....**
కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణ పరిధిలో మహిళ అదృశ్యమైన ఘటన స్థానికంగా కలకలం రేపింది. మోత్కులగూడెం గ్రామానికి చెందిన దున్నపోతుల సంపత్ (తండ్రి: సమ్మయ్య) తేదీ 12-02-2026 న జమ్మికుంట పోలీస్ స్టేషన్‌కు హాజరై తన భార్య అదృశ్యంపై ఫిర్యాదు చేశారు.
ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం, సుమారు 11 సంవత్సరాల క్రితం మహేశ్వరి అనే మహిళతో తన వివాహం జరిగిందని, వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిపారు. కుటుంబ జీవితం కొంతకాలం సజావుగా సాగిందని, అయితే తేదీ 05-02-2026 ఉదయం భార్యాభర్తల మధ్య స్వల్ప వాగ్వాదం జరిగిందని పేర్కొన్నారు.
అనంతరం తాను కూలి పనికి వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చేసరికి మహేశ్వరి ఇంట్లో కనిపించలేదని తెలిపారు. వెంటనే చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద ఆచూకీ కోసం వెతికినా ఎలాంటి సమాచారం లభించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.
ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు వెంటనే మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆమె ఫోన్ కాల్ డేటా, పరిచయ వర్గాలు తదితర అంశాలపై విచారణ చేపట్టినట్లు సమాచారం. అదేవిధంగా సమీప ప్రాంతాల్లో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.
ఈ ఘటనతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. మహేశ్వరి ఆచూకీ తెలిసిన వారు సమీప జమ్మికుంట పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.
ఈ సంఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# పౌర బాధ్యతలో 'లండన్' మాధురి ఆదర్శం

- మాధురి పౌర బాధ్యతను అభినందించిన మున్సిపల్ కమిషనర్ అయాజ్





**భారతీయ వెలుగు ప్రతినిధి జమ్మికుంట, ఫిబ్రవరి 12**
ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ఎన్నో ప్రచారాలు చేస్తున్న వేళ, ఒక యువతి తీసుకున్న నిర్ణయం అధికారులను సైతం ఆశ్చర్యపరిచింది. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని, కొత్తపల్లికి చెందిన కొక్కుల మాధురి, లండన్ దేశంలో స్థిరపడినప్పటికీ, తన బాధ్యతను మరువకుండా స్వగ్రామానికి చేరుకుని ఓటు హక్కు వినియోగించుకోవడం విశేషం. జమ్మికుంట మున్సిపాలిటీ 20వ వార్డు నుంచి బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన తల్లి కొక్కుల శ్రీలత-కేదారేశ్వర్ కు మద్దతుగా నిలవడమే కాకుండా, ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వామి కావాలని ఆమె నిర్ణయించుకున్నారు. మాధురి చూపిన ఈ అచంచలమైన పౌర బాధ్యతను తెలుసుకున్న జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్, స్వయంగా ఆమె నివాసానికి వెళ్ళి ప్రత్యేకంగా అభినందించారు. విదేశాల్లో ఉంటూ కూడా మన దేశ ప్రజాస్వామ్య ప్రక్రియపై గౌరవంతో ఇంత దూరం వచ్చి ఓటు వేయడం యువతకు ఆదర్శమని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆమెను సన్మానించి, బాధ్యతాయుతమైన పౌరురాలిగా ఆమె చూపిన చొరవను ప్రశంసించారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న తల్లికి మద్దతుగా లండన్ నుంచి వచ్చిన కూతురి ప్రేమ, ఓటుపై ఆమెకున్న అవగాహన ఇప్పుడు పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

# అమరావతి మన భవిష్యత్‌కు బాట

- కేవలం రాజధానిగా మాత్రమే కాదు
- గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంలో ఎమ్మెల్యే మద్దిపాటి

అమరావతి నిర్మాణం ఒక్క రాజధానిగా చూడరాదని, అది తెలుగు ప్రజల భవిష్యత్ అని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. అమరావతిని వ్యతిరేకిస్తున్న వారు అసలు నిజాలు గుర్తించాలన్నారు. ఏపీ శాసనసభలో గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ గురువారం ప్రారంభమైంది. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఈ చర్చను ప్రారంభించారు. ఈ ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించి 20 నెలలు అయిన సందర్భంగా, గవర్నర్ తన ప్రసంగంలో ప్రభుత్వ లక్ష్యాలు, విజయాలను ప్రస్తావించారని ఆయన అన్నారు. వైసీపీ హయాంలోని 'జంగిల్ రాజ్' నుంచి రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం బయటపడేసి స్థిరత్వం తీసుకొచ్చిందని వెంకట్రాజు పేర్కొన్నారు. రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు వంటి అనేక అంశాల్లో పురోభివృద్ధి కనిపిస్తోందని తెలిపారు. నేక రంగాల్లో గణనీయమైన మార్పు వచ్చిందని గవర్నర్ ప్రసంగంలో పేర్కొన్నారని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని.. తనను తాను సామాజిక సేవకుడిగా ప్రకటించుకున్నారని ఆయన చెప్పారు. ఎడారి ప్రాంతాలను కూడా ఉద్యానవనాలుగా తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో విద్యా విధానం ఒడిదుడుకులు ఎదుర్కొందని.. గత ప్రభుత్వ పాలకుల వ్యవస్థల విధ్వంసం వల్ల అనేక కంపెనీలు రాష్ట్రం నుంచి వెళ్లిపోయాయని ఆయన విమర్శించారు. వైసీపీ హయాంలో మహిళల భద్రత, శాంతిభద్రతలు దారుణమైన పరిస్థితుల్లో ఉన్నాయని ఎమ్మెల్యే వెంకట్రాజు ఆరోపించారు.

# 'కమ్యూనిటీ పోలీసింగ్' ద్వారా ప్రజలతో మమేకం: సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్

**-సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ 24వ ఆవిర్భావ దినోత్సవం**

**-అభివృద్ధికి అండగా... భద్రతకు భరోసాగా..**

హైదరాబాద్ ఫిబ్రవరి 12 భారతీయ వెలుగు

సైబరాబాద్ 24వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా ఈరోజు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీస్ అధికారులకు, సిబ్బందికి శు భాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. సైబరాబాద్ మెట్రోపాలిటన్ చట్టం ప్రకారం 2003లో స్థాపించిన సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్, వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణ ప్రాంతానికి సేవలందిస్తున్న ప్రముఖ అర్బన్ పోలీసింగ్ వ్యవస్థగా నిలిచిందని గుర్తుచేశారు. నాటి తొలి సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌గా ఎం. మహేందర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారని, ఈ 23 ఏళ్ల ప్రస్థానంలో ప్రాంత అభివృద్ధిలో పోలీసుల కష్టం, స్వేదం, త్యాగం కీలక పాత్ర పోషించాయన్నారు. సైబరాబాద్ లో నిర్మించిన ప్రతీ కట్టడంలో, జరిగిన ప్రతి అభివృద్ధి పనుల్లో సైబరాబాద్ పోలీసుల సేవలు చిరస్థాయిగా, అజరామరంగా నిలిచిపోయాని, జాతీయ పతాకం సాక్షిగా ప్రజాసేవకు మరింత అంకితభావంతో పనిచేయాలని సంకల్పం వ్యక్తం చేశారు.

సాంకేతికతను వినియోగిస్తూ ఆధునిక పోలీసింగ్‌లో సైబరాబాద్ కమిషనరేట్ దేశ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందని సీపీ తెలిపారు. పునర్విభజనల నేపథ్యంలో, జనాభా, విస్తీర్ణం ఆధారంగా 'కోర్ అర్బన్ రీజన్ (జఖ=జు)'ని మూడు జోన్లుగా విభజించడం జరుగిందని, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌తో సమన్వయం పెంచుతూ పోలీస్ స్టేషన్లు, డివిజన్లను మున్సిపల్ వార్డులు, సర్కిళ్లకు అనుసంధానం చేస్తున్నట్లు చెప్పారు.

సైబరాబాద్ పోలీసులు టెక్నాలజీ ఆధారిత కమాండ్ కంట్రోల్ సిస్టమ్స్, సైబర్ క్రైమ్ దర్యాప్తులు, ట్రాఫిక్ నిర్వహణ, కమ్యూనిటీ పోలీసింగ్, పబ్లిక్ --ప్రైవేట్ భాగస్వామ్యాల ద్వారా దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచాయన్నారు. సైబరాబాద్ పోలీసుల ప్రొఫెషనల్ నైపుణ్యాలకు జాతీయ స్థాయి పురస్కారాలు లభించాయన్నారు. సైబరాబాద్ ప్రాంతం దేశ జీడీపీకి గణనీయంగా తోడ్పడుతున్నదని, ఐటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, ఫార్మా, బయోటెక్నాలజీ, ఎంఎస్ఎంఈలు, మౌలిక




సదుపాయాల అభివృద్ధి, రియల్ ఎస్టేట్ రంగాల వృద్ధికి పోలీసులు కల్పించే భద్రతే పునాది అని సీపీ స్పష్టం చేశారు. ఔటర్ రింగ్ రోడ్ నుంచి ఎయిర్‌పోర్ట్ వరకు భద్రతా వ్యవస్థ బలోపేతం అయ్యిందని, 23 ఏళ్ల ప్రగతి ప్రతిబింబించే ప్రత్యేక వీడియోను ఆవిష్కరించినున్నట్లు తెలిపారు. అలాగే, సైబరాబాద్ ఇప్పటివరకు కమిషనరేట్‌లో సేవలందించిన మాజీ పోలీస్ కమిషనర్లను సన్మానించనున్నట్లు తెలిపారు.

సైబర్ నేరాలు, పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు ప్రధాన సవాళ్లుగా ఉన్నాయని సీపీ తెలిపారు. యుద్ధాల కంటే రోడ్డు ప్రమాదాల్లోనే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా భద్రతా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ఉపాధి, వ్యాపారం, పనుల కోసం వచ్చిన లక్షలాది మంది వలస కార్మికుల భద్రత, సంక్షేమం పోలీసుల బాధ్యత అని చెప్పారు. వారికి ఇన్సూరెన్స్, మెడికల్ కేర్ వంటి సదుపాయాలు నిబంధనల ప్రకారం అందించాల్సిందేనని, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. సేవ, ప్రవర్తన ద్వారా ప్రజల విశ్వాసం గెలవాలని, 'కమ్యూనిటీ కనెక్ట్' కార్యక్రమాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు పోలీసులు తోడుగా ఉన్నారన్న భరోసా కల్పించాలని అన్నారు. సైబరాబాద్ లో ప్రత్యేక నేర విభాగాలు, సైబర్ ఎన్ ఫోర్స్ మెంట్ యూనిట్లు, ప్రజలతో భాగస్వామ్య కార్యక్రమాల ద్వారా భద్రతను మరింతగా బలోపేతం చేస్తున్నామన్నారు.

కార్యక్రమంలో భాగంగా సీపీ ఆఫీసు ప్రాంగణంలో సీపీ మొక్క నాటారు. అనంతరం ధీర, వీర, ధృవ, భీమ, రాఖీ, తేజ, మౌని, లైకా పోలీసు జాగిలాల గౌరవ వందనం సమర్పించాయి. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సీపీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పోలీసు సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.




ఫార్మేషన్ డే సందర్భంగా నార్సింగి సైకిల్ ట్రాక్ పై ప్రజలతో కలిసి పోలీసులు ప్రజలతో కలిసి సైక్లింగ్ చేశారు.

సైబరాబాద్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో..

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. బాచుపల్లి పోలీస్ స్టేషన్‌లో పాఠశాల విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేయగా, రాయదుర్గం పోలీసులు మణికొండ ప్రభుత్వ పాఠశాలలోని 500 మంది విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. జీడిమెట్ల, మేడ్చల్ పరిధిలో పోలీసులు ఆసుపత్రులు, ఆశ్రమాలను సందర్శించి రోగులకు, మానసిక వికలాంగులకు పండ్లు పంపిణీ చేశారు. అలాగే ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ నిబంధనలపై పలు అవగాహన కార్యక్రమాలు చేశారు. పోలీసింగ్‌తో పాటు సామాజిక బాధ్యతను చాటుతూ మియాపూర్ మరియు రామచంద్రాపురం ట్రాఫిక్ పోలీసులు వినూత్న కార్యక్రమాలు చేపట్టారు. రోడ్డు నిబంధనలు పాటిస్తూ హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించిన వాహనదారులకు, యూనిఫాంలో ఉన్న ఆటో డ్రైవర్లకు గులాబీ పువ్వులు, చాక్లెట్లు ఇచ్చి అభినందించారు. బాధ్యతాయుతమైన డ్రైవింగ్‌ను ప్రోత్సహించేందుకు ఈ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఇలా కమిషనరేట్ వ్యాప్తంగా రక్తదాన శిబిరాలు, మొక్కలు నాటడం మరియు కమ్యూనిటీ సర్వీస్ కార్యక్రమాలతో 24వ ఆవిర్భావ దినోత్సవం ప్రజల మధ్య ఒక పండుగలా, ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, శేరిలింగంపల్లి డీసీపీ సి. హెచ్. శ్రీనివాస్, అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ, డీసీపీ క్రైమ్స్ ముత్యం రెడ్డి, డీసీపీ స్పెషల్ బ్రాంచ్ వై.వి.ఎస్. సుధీంద్ర, సైబర్ క్రైమ్స్ డీసీపీ సాయి మనోహర్, ఎస్ఓటీ డీసీపీ శోభన్ కుమార్, ట్రాఫిక్-1 డీసీపీ రంజన్ రతన్ కుమార్, సీఏఆర్ హెడ్ క్వార్టర్ డీసీపీ సంజీవ్, ఇతర ఏడీసీపీలు, ఏసీపీలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సెల్ ఫోన్ స్నాచింగ్ నిందితుడి అరెస్ట్:

**పరారీలో ఉన్న నేరగాడు పట్టివేత**

**నగదు స్వాధీనం.. నిందితుడిపై గతంలోనూ పలు కేసులు**

**డిసిపి జి. చంద్ర మోహన్ వెల్లడి**

హైదరాబాద్, ఫిబ్రవరి 12: భారతీయ వెలుగు

కుల్సుంపురా పోలీస్ స్టేషన్ పరిధిలో సెల్ ఫోన్ స్నాచింగ్‌కు పాల్పడి, గత కొంతకాలంగా తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని పోలీసులు ఎట్టకేలకు అరెస్ట్ చేశారు. నిందితుడి నుండి నగదును స్వాధీనం చేసుకున్నట్లు గోల్కొండ జోన్ డిసిపి శ్రీ జి. చంద్ర మోహన్, ఖూూ ఒక ప్రకటనలో తెలిపారు.

నిందితుడి వివరాలు: అరెస్టయిన నిందితుడు భవానీ నగర్‌కు చెందిన సయ్యద్ ఫక్రూ అలియాస్ అర్బాజ్ (23). ఇతను బహదూర్‌పురాలోని ఒక పాత టైర్ల షాపులో పనిచేస్తుంటాడు. ఇతనిపై గతంలో భవానీ నగర్ పోలీస్ స్టేషన్‌లో హత్యాయత్నం మరియు ఆయుధాల చట్టం కింద కేసులు నమోదై ఉన్నాయి.

కేసు వివరాలు: గత ఏడాది డిసెంబర్ 16న, ఫిర్యాదుదారుడు తన స్నేహితులతో కలిసి జియాగూడలోని పీలా మండపం వద్ద మాట్లాడుకుంటుండగా, నిందితుడు అర్బాజ్ తన స్నేహితుడు ఇంతియాజ్‌తో కలిసి హోండా యాక్టివాపై అక్కడకు చేరుకున్నాడు. వీరితో పాటు మరో ఇద్దరు సహచరులు హాజీ, కలీమ్ కూడా ఉన్నారు. ఫోన్ వాడుతున్న బాధితుడిని గమనించిన నిందితులు, వేగంగా వాహనాన్ని దగ్గరకు తీసుకెళ్లి చేతిలోని ఫోన్‌ను లాక్కొని పరారయ్యారు. అనంతరం ఆ ఫోన్‌ను విక్రయించగా వచ్చిన డబ్బులో అర్బాజ్ తన వాటాగా రూ. 2,500 తీసుకున్నాడు.

పోలీసుల దర్యాప్తు: ఈ కేసులో ఇప్పటికే మొహమ్మద్ ఇంతియాజ్ ఏ షూటర్, షేక్ హాజీలు జైలులో ఉండగా, పరారీలో ఉన్న అర్బాజ్‌ను క్రైమ్ టీమ్ నిన్న పట్టుకుంది. నిందితుడి వద్ద నుండి రూ. 2,000 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు కలీమ్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

కేసును ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసిన కుల్సుంపురా ఇన్ స్పెక్టర్ ఎ. రాములు, డిటెక్టివ్ ఇన్ స్పెక్టర్ డి. నాగార్జున మరియు క్రైమ్ టీమ్ సభ్యులను డిసిపి అభినందించారు.

ఈ ఆపరేషన్ అడిషనల్ డిసిపి కృష్ణ గౌడ్ మరియు గోషామహల్ ఏసిపి సుదర్శన్ గారి పర్యవేక్షణలో నిర్వహించబడింది.

జారీ చేసిన వారు: డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్, గోల్కొండ జోన్ కార్యాలయము, హైదరాబాద్ సిటీ.

# ఆటోలో ప్రయాణికులే లక్ష్యంగా చోరీలు: ముగ్గురు సభ్యుల ముఠా అరెస్ట్

**రెండు కేసుల ఛేద్యం..**

**నగదు, ఆటో స్వాధీనం ।**

**డిసిపి జి. చంద్ర మోహన్ వెల్లడి**

హైదరాబాద్, ఫిబ్రవరి 12: భారతీయ వెలుగు

ఆటోలో ప్రయాణికులే లక్ష్యంగా చేసుకొని వారి దృష్టి మళ్లించి దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర నేరగాళ్ల ముఠాను అఫ్జల్‌గంజ్ పోలీసులు పట్టుకున్నారు. ముఠాలోని ముగ్గురు సభ్యులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి నగదు మరియు నేరానికి ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు గోల్కొండ జోన్ డిసిపి శ్రీ జి. చంద్ర మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు.

నిందితుల వివరాలు: పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో సయ్యద్ గయాజ్ హష్మి (ఆటో డ్రైవర్), సయ్యద్ అబ్దుల్ హసన్ అలియాస్ కాల జామూన్ (పెయింటర్), మరియు మహమ్మద్ వసీం (ఆటో డ్రైవర్) ఉన్నారు. ఈ ముఠాలో ప్రధాన నిందితుడు జుబేర్ లాలా ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

కేసు నేపథ్యం ఱ దర్యాప్తు: ఈనెల 11వ తేదీన పురానాపూల్‌కు చెందిన పి. దయానంద్ (82) అనే విశ్రాంత ఉద్యోగి అఫ్జల్‌గంజ్ బస్టాప్ వద్ద ఆటో ఎక్కారు. ఆటోలో అప్పటికే ముగ్గురు వ్యక్తులు కూర్చుని ఉన్నారు. ప్రయాణ మధ్యలో వారు దయానంద్‌ను సరిగ్గా కూర్చోవాలని ఇబ్బంది పెడుతూ, డెంటల్ కాలేజీ వద్ద ఆటో రిపేర్ వచ్చిందని దించేశారు. కొద్ది దూరం వెళ్ళాక తన జేబులో ఉన్న రూ. 1500 చోరీకి గురైనట్లు బాధితుడు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన అఫ్జల్‌గంజ్ ఇన్ స్పెక్టర్ ఎన్. రవి, డిటెక్టివ్ ఇన్ స్పెక్టర్ బి. రవికిరణ్ బృందం సిసిటివి ఫుటేజీల ఆధారంగా నిందితులను పట్టుకున్నారు.

నేర పద్ధతి (వీశీఎబం ూజూవఖ్ఱఅఎఱ): నిందితులు ఆటోలో ప్రయాణికుల్లా నటిస్తూ అమాయక మరియు వృద్ధులను ఎక్కించుకుంటారు. ప్రయాణంలో బాధితులను తోస్తూ, వారి దృష్టి మళ్లించి జేబుల్లోని నగదు, సెల్ ఫోన్లు కాజేస్తారు. పని పూర్తయ్యాక 'ఆటో పాడైంది' అని చెప్పి బాధితులను మధ్యలోనే దించేసి పరారవుతారు.

నేర చరిత్ర:

ఏ2 (గయాజ్ హష్మి): ఇతనిపై నగరంవ్యాప్తంగా అబిడ్స్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ వంటి వివిధ పోలీస్ స్టేషన్లలో 15 దొంగతనం కేసులు ఉన్నాయి.

ఏ3 (అబ్దుల్ హసన్): ఇతను గతంలో హత్య కేసు (చాదర్‌ఘాట్ పిఎస్) మరియు ఆయుధాల చట్టం వంటి 3 తీవ్రమైన కేసుల్లో నిందితుడు.

సమర్థవంతంగా పనిచేసి ఈ ముఠాను పట్టుకున్న డిఎస్ఐ వి. నరేందర్ రెడ్డి, హెచ్‌సీలు మధుసూదన్, శ్రీకాంత్ బిడ్ల మరియు పీసీల బృందాన్ని డిసిపి ప్రత్యేకంగా అభినందించారు. వారికి తగిన రివార్డులు అందజేస్తామని ప్రకటించారు.

ఈ ఆపరేషన్ గోల్కొండ జోన్ డిసిపి జి. చంద్ర మోహన్, అడిషనల్ డిసిపి కృష్ణ గౌడ్ మరియు గోషామహల్ ఏసిపి ఎస్. సుదర్శన్ గారి పర్యవేక్షణలో నిర్వహించబడింది.

# శివరాత్రి సందర్భంగా కీసరగుట్టలో ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్ ఫిబ్రవరి 12 భారతీయ వెలుగు

కీసరగుట్టలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో 15.02.2026న జరిగే మహా శివరాత్రి పండుగ దృష్ట్యా జవహర్ నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వాహనాల రాకపోకలపై ట్రాఫిక్ మళ్లింపులు విధించబడుతున్నాయి. జవహర్ నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 13.02.2026 నుండి 18.02.2026 వరకు బ్రహ్మోత్సవ వేడుకలు జరగనున్నాయి. ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపుల వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.,

మళ్లింపులు చేయబడే భారీ వాహనాలు.

13.02.2026 నుండి 18.02.2026 వరకు 06 రోజుల పాటు ట్రాఫిక్‌ను మళ్లిస్తారు. మళ్లింపుల మార్గాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

ూ== లేదా చేర్యాల్ ఞ రోడ్డు నుండి వచ్చే భారీ వాహనాలను కీసర గ్రామం వైపు వెళ్లడానికి అనుమతించరు మరియు కీసర ూ== వద్ద ఘట్కేసర్ లేదా షామీర్‌పేట్ వైపు ూ==/ూ== సర్వీస్ రోడ్డు ద్వారా మళ్లిస్తారు. ఉద్దేమర్రి మరియు బొమ్మలరామారం నుండి వచ్చే భారీ వాహనాలను కీసర గ్రామం ఞ రోడ్డు వైపు వెళ్లడానికి అనుమతించరు. వాటిని రంగాపురం చౌరస్తా వద్ద ఉద్దేమర్రి - రంగాపురం చౌరస్తా మరియు బొమ్మలరామారం ద్వారా మళ్లిస్తారు మరియు దీనికి విరుద్ధంగా. షామీర్‌పేట్ నుండి కీసర గ్రామం ఞ రోడ్డు వైపు వచ్చే భారీ వాహనాలను యాద్గరిపల్లి వద్ద యాద్గరిపల్లి ఞ రోడ్డు ద్వారా ఘట్కేసర్ వైపు కుడి మలుపు తీసుకొని, ూ== సర్వీస్ రోడ్డు ద్వారా లేదా చేర్యాల గ్రామం మీదుగా జుజ×ూ వైపు మళ్లిస్తారు. బోగారం నుండి కీసర విలేజ్ ఞ రోడ్ల వైపు వచ్చే భారీ వాహనాలను వన్నెగూడ ఞ రోడ్ వద్ద కీసర దయారా మీదుగా ూ== వైపు, ఆపై ఘట్కేసర్ లేదా షామిర్‌పేట్ వైపు మళ్లిస్తారు. పౌరులందరూ పైన పేర్కొన్న మార్గాలను గమనించి, తదనుగుణంగా తమ కదలికలను ప్లాన్ చేసుకుని, రాచకొండ ట్రాఫిక్ పోలీసులతో సహకరించాలని అభ్యర్థించారు. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్, ట్రాఫిక్-× మల్కాజ్‌గిరి జోన్, మల్కాజ్‌గిరి కమిషనరేట్.

# అంతర్రాష్ట్ర సెల్ ఫోన్ స్నాచింగ్ ముఠా అరెస్ట్: 21 ఫోన్లు స్వాధీనం

**పశ్చిమ బెంగాల్, జార్ఖండ్ నేరగాళ్ల ముఠా గుట్టురట్టు రూ. 6 లక్షల విలువైన సెల్ ఫోన్ లు రికవరీ చేసిన మెహదీపట్నం పోలీసులు**

హైదరాబాద్, ఫిబ్రవరి 12: భారతీయ వెలుగు

నగరంలోని రద్దీ ప్రాంతాల్లో సెల్ ఫోన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాను మెహదీపట్నం పోలీసులు అరెస్ట్ చేశారు. ముగ్గురు పశ్చిమ బెంగాల్ వాసులు, ఒక జార్ఖండ్ వాసితో కూడిన ఈ నలుగురు సభ్యుల ముఠా నుండి 21 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు గోల్కొండ జోన్ డిసిపి శ్రీ జి. చంద్ర మోహన్ వెల్లడించారు. నిందితుల వివరాలు: అరెస్టయిన వారిలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన అనిల్ కుమార్ నోనియా, గౌరవ్ నోనియా మరియు జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన పరణ్ కుమార్, దేవా కుమార్ ఉన్నారు. ఈ ముఠాకు సూత్రధారి అయిన సాగర్ కుమార్ నోనియా ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. కేసు వివరాలు ఱ దర్యాప్తు: మెహదీపట్నం ఇన్‌స్పెక్టర్ ఎస్. మల్లేష్ మరియు డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఎన్. రాంబాబు నేతృత్వంలోని క్రైమ్ టీమ్ బుధవారం సాయంత్రం విశ్వసనీయ సమాచారం మేరకు తనిఖీలు చేపట్టి ఈ ముఠాను అదుపులోకి తీసుకుంది. నిందితుల నుండి సుమారు 6 లక్షల రూపాయల విలువ చేసే 21 ఖరీదైన సెల్ ఫోన్లను మరియు వెయ్యి రూపాయల నగదును పోలీసులు రికవరీ చేశారు.

నేర పద్ధతి (వీశీఎబం ూజూవఖ్ఱఅఎఱ): వృత్తి పేరుతో వేషం: నిందితులు నగరంలో టీ స్టాల్స్, చాట్ బండార్ మరియు కూరగాయల వ్యాపారుల అవతారమెత్తి రద్దీ ప్రాంతాలను గమనించేవారు.

టార్గెట్ ప్రాంతాలు: రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్లు మరియు జనం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఒంటరిగా ఉన్న వారి ఫోన్లను లాక్కొని పరారయ్యేవారు.

కమిషన్ పద్ధతి: పరారీలో ఉన్న సాగర్ కుమార్ వీరికి వసతి కల్పించి, ప్రతిరోజూ వెయ్యి రూపాయల వేతనం ఇచ్చి ఈ నేరాలకు ప్రోత్సహించేవాడు. సేకరించిన ఫోన్లను సాగర్ కుమార్‌కు అప్పగిస్తే అతను వాటిని విక్రయించేవాడు. కేసును అత్యంత వేగంగా ఛేదించి, దొంగలను పట్టుకున్న మెహదీపట్నం క్రైమ్ టీమ్ సభ్యులు డిఎస్ఐ సాయి కిరణ్ మరియు ఇతర సిబ్బందిని డిసిపి శ్రీ జి. చంద్ర మోహన్ గారు ప్రత్యేకంగా అభినందించారు. వీరికి తగిన రివార్డులు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఆపరేషన్ అడిషనల్ డిసిపి కృష్ణ గౌడ్ మరియు ఆసిఫ్ నగర్ ఏసిపి బి. కిషన్ కుమార్ గారి పర్యవేక్షణలో విజయవంతంగా నిర్వహించబడింది.

# ప్రజలతో మమేకమై..

హైదరాబాద్ ఫిబ్రవరి 12 భారతీయ వెలుగు

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ 24వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈరోజు సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. బాచుపల్లి పోలీస్ స్టేషన్‌లో పాఠశాల విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేయగా, రాయదుర్గం పోలీసులు మణికొండ ప్రభుత్వ పాఠశాలలోని 500 మంది విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. జీడిమెట్ల, మేడ్చల్ పరిధిలో పోలీసులు




ఆసుపత్రులు, ఆశ్రమాలను సందర్శించి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అలాగే ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ నిబంధనలపై పలు అవగాహన కార్యక్రమాలు చేశారు. పోలీసింగ్‌తో పాటు సామాజిక బాధ్యతను చాటుతూ మియాపూర్ మరియు రామచంద్రాపురం ట్రాఫిక్ పోలీసులు వినూత్న కార్యక్రమాలు చేపట్టారు. రోడ్డు నిబంధనలు పాటిస్తూ హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించిన వాహనదారులకు, యూనిఫాంలో ఉన్న ఆటో డ్రైవర్లకు గులాబీ పువ్వులు, చాక్లెట్లు ఇచ్చి అభినందించారు. బాధ్యతాయుతమైన డ్రైవింగ్‌ను ప్రోత్సహించేందుకు ఈ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఇలా కమిషనరేట్ వ్యాప్తంగా రక్తదాన శిబిరాలు, మొక్కలు నాటడం మరియు కమ్యూనిటీ సర్వీస్ కార్యక్రమాలతో 24వ ఆవిర్భావ దినోత్సవం ప్రజల మధ్య ఒక పండుగలా, ఘనంగా జరిగింది.

